ప్రతి అక్షరం - ప్రజల పక్షం
# తెలంగాణ చేతనం
తెలుగు దినపత్రిక

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 9 | సంచిక : 201 | ఎడిటర్: శ్రీనివాస్ | శుక్రవారం 26.1.2024 | పేజీలు :8 | వెల: 5

## పాస్‌పోర్టు స్కామ్‌లో మరో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన పాస్‌పోర్టుల కుంభకోణంలో తెలంగాణ సీఐడీ దర్యాప్తును వేగవంతం చేసింది. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అనర్హులకు పాస్ పోర్టులు జారీ చేసిన వ్యవహారంలో సీఐడీ మరో ఇద్దరిని అరెస్టు చేసింది. అనంతపురానికి చెందిన ఏజెంట్‌తో పాటు మరొకరిని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. వీరి నుంచి పాస్‌పోర్టులు సహా పలు నకిలీ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో 12 మందిని సీఐడీ అరెస్టు చేయగా.. తాజా అరెస్టులతో ఈ సంఖ్య 14కి చేరింది. మరో వైపు ఇప్పటికే 92 నకిలీ పాస్‌పోర్టులను గుర్తించిన సీఐడీ.. దేశంలోని అన్ని విమానాశ్ర యాలను అప్రమత్తం చేయడంలో నిమగ్నమైంది. వీరిలో పలువురు ఇప్పటికే విదేశాలకు వెళ్లగా.. మిగతావారినైనా దేశం దాటకుండా ఉండేందుకు లుక్‌అవుట్ నోటీసులు జారీ చేస్తోంది.

విలేకరులు కావలెను
తెలంగాణ చేతనం తెలుగు దినపత్రిక తెలుగు రాష్ట్రాల్లో
(తెలంగాణ & ఆంధ్రప్రదేశ్)
ప్రజాదరణ పొందుతున్న
తెలంగాణ చేతనం తెలుగుదినపత్రికలో
పని చేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు,
మండల రిపోర్టర్లు, అడ్వర్టైస్‌మెంట్ స్టాఫ్ కావలెను.
సంప్రదించవలసిన నెంబర్స్
9010899869, 9885355955
Mail ID : telanganachethanam@gmail.com

## అవును.. మీకు గోరి కట్టే గుంపు మేస్త్రిని



తనను గుంపు మేస్త్రి అంటూ బీఆర్ఆర్ఎస్ చేస్తున్న ట్రోల్స్ పై సీఎం రేవంత్ రెడ్డి తొలిసారి రియాక్ట్ అయ్యారు. తాను మేస్త్రీ నేనని.. విధ్వంసమైన తెలంగాణను పునర్ నిర్మించడంతో పాటు మీకు (బీఆర్ఎస్) గోరీ కట్టే మేస్త్రిని నేనే అంటూ ఘాటు విమర్శలు చేశారు. ఇవాళ ఎల్బీ స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ బూత్ లెవల్ లీడర్స్ మీటింగ్ లో మాట్లాడిన రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 50 రోజులు కాలేదు అప్పుడే హామీల అమలు ఎక్కడా అని బిల్ల,రంగాలు ప్రశ్నిస్తున్నారని కేటీఆర్, హరీశ్‌రావులను ఉద్దేశించి మండిపడ్డారు. బీఆర్ఎస్ పులి బయటకు వస్తే బోనులో వేసి బొందపెట్టేం దుకు కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. కామారెడ్డిలో కేసీఆర్ ఏదో పొడుస్తా అన్నాడు.. కానీ చెప్పినట్లుగా ఓడించామా లేదా అన్నారు.

**బిడ్డా.. వస్తున్నా కాస్కోండి:**

సీఎంగా ఉన్నాను కాబట్టి ఇన్నాళ్లు పరిపాలనపై దృష్టి పెట్టి రాజకీయంగా మాట్లాడటం లేదన్నారు. కానీ మాట్లాడకపోతే పని జరిగేలా లేదని, బీఆర్ఎస్ నేతలు ఏది పడితే అది అబద్దాలు చెబుతున్నారని ఫైర్ అయ్యారు. జిల్లాల పర్యటనలకు వస్తున్నానని బిడ్డా కాస్కోవాలంటూ నిప్పులు చెరిగారు. వారంలో 3 రోజులు రేవంతన్నగా ప్రజల మధ్యకు రాబోతున్నట్లు చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ, కేటీ వేరు వేరు కాదని ఈ ఇద్దరి రూపాలు మాత్రమే వేరన్నారు. కేసీఆర్, మోడీ నాణేనికి బొమ్మా బొరుసులాంటివారని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఒకటి, రెండు ఎంపీలు గెలిచినా ఢిల్లీకి వెళ్లి అవి మళ్లీ మోడికే ఇస్తారని ఆరోపించారు. కేసీఆర్ కు పడే ప్రతి ఓటు పరోక్షంగా బీజేపీకే పడుతుందన్నారు. బీఆర్ఎస్ ను మొన్నటి ఎన్నికల్లో ఓడించామని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తరిమికొడదామని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీని గెలిపించి రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేద్దామన్నారు.

ఫిబ్రవరి మొదటి వారంలో మరో 2 హామీలు అమలు చేస్తామని కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు అమలు చేశారా అని నిలదీశారు. ఫిబ్రవరి ఆఖరు వరకు రైతుభరోస ద్వారా నగదు అందిస్తామన్నారు.

## నేతలంతా కలిసి పనిచేస్తేనే లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు



హైదరాబాద్: బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నేతలందరూ కలిసి పనిచేస్తేనే లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. గురువారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బూత్‌స్థాయి కన్వీనర్ల సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. రెండు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి, ఎన్నికల కోసం అంతా కలిసి పనిచేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి బూత్ స్థాయి కార్యకర్తలే బలమని, కష్టపడి పనిచేయాలని కోరారు. ఈడీ, సీబీఐ దాడులు జరిగే అవకాశముందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి కృషి చేయాలన్నారు.

“దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిపోయింది. ప్రధాని మోదీ గతంలో ఎన్నో హామీలు ఇచ్చారు. నల్లధనం తీసుకొచ్చి ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15లక్షల చొప్పున వేస్తామని చెప్పారు. కానీ, ఆ హామీని మర్చిపోయారు. తెలంగాణలో ఆరు గ్యారంటీల్లో రెండింటిని అమలు చేశాం. త్వరలోనే మరో రెండు అమలు చేస్తాం. తెలంగాణ ప్రభుత్వ పనితీరు దేశానికి ఆదర్శం కావాలి. మోదీకి రైతుల బాధలు, కష్టాలు తెలియవు. ఆయన సమస్యలు పరిష్కరించరు.. పక్కదారి పట్టిస్తారు. పాకిస్థాన్, చైనా, దేవుడి పేరు చెప్పి రాజకీయాలు చేస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ బలంగా ఉంది. అందుకే భారాస, భాజపాను ఓడించాం.

ప్రజలకు న్యాయం చేయడం కోసమే రాహుల్ గాంధీ న్యాయ్ యాత్ర చేస్తున్నారు. మోదీ మాటలు నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దు. దేశాన్ని అప్పుల్లో ముంచారు. ప్రభుత్వ ఖర్చుతో ఆయన ప్రచారం చేసుకుంటున్నారు. పదేళ్ల భాజపా పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. మణిపుర్ అగ్నిగుండంలా మారి వేలాది మంది చనిపోతే ఒక్కసారి కూడా ప్రధాని అక్కడికి వెళ్లలేదు. మోదీ, భాజపా ఎప్పుడూ ఎన్నికల్లో గెలిచే కుట్రలే చేస్తారు” అని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం తీరు: డీకే అరుణ

మహిళల పట్ల పోలీసుల ప్రవర్తనపై బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఫైరయ్యారు. నిన్న జరిగిన ఏబీవీపీ కార్యకర్త ఝాన్సీని పోలీసులు జుట్టు పట్టుకుని లాగి ఘటనపై డీకే అరుణ స్పందించారు. ఈ ఘటనలో పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నానని, బీఆర్ఎస్ ప్రభుత్వం తీరులాగే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఒక మహిళా కార్యకర్తపై పోలీసుల ప్రవర్తన బాదాకరమన్నారు. పోలీసుల వ్యవహార శైలిపై సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని.. వారిపై కఠిన చర్యలు తీసుకొని, వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

## దావోస్‌లో రేవంత్ చెప్పినవన్నీ అబద్దాలే ..



హైదరాబాద్ బీఆర్ఎస్ నేతలు ఏం మాట్లాడినా గవర్నర్‌కు తప్పు కనిపించిందని.. కానీ, కాంగ్రెస్ విషయంలో ఆమె పూర్తి సానుకూలంగా ఉందని విమర్శలు చేశారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి , కేటీఆర్ . రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు వేర్వేరుగా నోటిఫికేషన్లు ఇచ్చి ఎమ్మెల్సీ స్థానాలు కాంగ్రెస్ పార్టీకి దక్కేలా చేశారని అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్ లో ఆయన నేడు మీడియాతో చిట్ చాట్ చేస్తూ, తాము అనుభవం ఉన్న వారిని సలహాదారులుగా నియమించుకుంటే గగ్గోలు పెట్టిన రేవంత్ రెడ్డి ఇప్పుడెలా రాజకీయ నాయకులను సలహాదారులుగా నియమించుకున్నారని ప్రశ్నించారు. వేం నరేందర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి ఏం సలహాలు ఇస్తారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు వుంటుందా? అనే అనుమానం ప్రజల్లో వుందని షాకింగ్ కామెంట్స్ చేశారు.. కొత్త ప్రభుత్వంపై కొద్ది రోజుల్లోనే అసాధారణంగా వ్యతిరేకత వచ్చిందని, హామీలు అడిగితే మంత్రులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ప్రజల మనసులు గాయ పడతాయన్నారు కేటీఆర్. రేవంత్ దావోస్ కు పోయి పచ్చి అబద్ధాలు చెప్పారని, రైతు బంధు ఉండగా మొదలు పెట్టనీ రైతు భరోసా ఇస్తున్నామని రేవంత్ అంటున్నారన్నారు. దీనిపై రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు..

తెలంగాణాలో కేసీఆర్ ను, బీఆర్ఎస్‌ను లేకుండా చేయాలని బీజేపీ, కాంగ్రెస్ లు కుమ్మక్కు అయ్యాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు లెక్క బెడితే 420 అని వచ్చిందని,వాళ్ళను అవమానించే ఉద్దేశ్యం లేదని అన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములు ను హై కోర్టు కు ఇవ్వడాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలి ? అని ఆయన ప్రశ్నించారు. దావోస్ కు రేవంత్ ఎందుకు వెళ్ళాడు అన్నట్టుగా భట్టి విక్రమార్క మాటల దాడి ఉందని, బహుళ జాతి సంస్థలపై భట్టి విక్రమార్క దుర్మార్గంగా మాట్లాడారన్నారు. ఏ విచారణ అయినా చేసుకోండి తప్పు చేసిన వారిని దోషిగా నిలబెట్ట అభ్యంతరం లేదని, తేల్చి చెప్పారు లోక్ సభ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొంటా మన్నారు. పార్టీ నిర్మాణం పై ఇక ముందు దృష్టి పెడతామని చెప్పారు..

రేవంత్ రెడ్డి రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ తెచ్చుకున్నారని కోమటిరెడ్డి అనలేదా? అంటూ కెసిఆర్ ప్రశ్నించారు.. కాంగ్రెస్ పార్టీకి ఒక సీఎంను ఐదు సంవత్సరాలు కొనసాగించే చరిత్ర లేదని అన్నారు. తమ పోరాటం కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో 420 హామీలు అమలు చేస్తారా? లేదా? అనే అంశం మీద అని అన్నారు. . కాంగ్రెస్, బీజేపీ కోఆర్డినేషన్ పర్ఫెక్ట్‌గా నడుస్తోంది. కొత్త కాంగ్రెస్ ప్రభుత్వానికి కాస్త సమయం ఇవ్వాలని కేసీఆర్ చెప్పారని అన్నారు. కానీ అనేక విషయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకుంటుందని.. అందుకే రాష్ట్ర బాగు కోసం తాము స్పందిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త సచివాలయం కడితే గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ ఇప్పుడు కొత్త సీఎం క్యాంపు ఆఫీసు, కొత్త హైకోర్టు ఎట్లా కడుతున్నారని ప్రశ్నించారు. సీఎం మారినప్పుడల్లా కొత్త క్యాంపు ఆఫీసులు వస్తాయా? అని అడిగారు. తాము కట్టిన ప్రగతి భవన్‌ను ఇగోతో డిప్యూటీ సీఎం భట్టికి రేవంత్ రెడ్డి ఇచ్చారని సీరియస్ కామెంట్స్ చేశారు. కేబినెట్‌లో చర్చించకుండానే రేవంత్ రెడ్డి నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి సాధించింది ఏం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలన ఢిల్లీ నుండే జరుగుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే వంద రోజుల్లో హామీలను అమలు చేయాలని అన్నారు.ఇక అసెంబ్లీ నియోజకవర్గాలలో జనరల్ బాడీ సమావేశాలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. ఫిబ్రవరి 10 లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, తెలంగాణ బలగం అనే పేరుతో బిఆర్ఎస్ సోషల్ మీడియా ఇకపై ఉంటుందన్నారు. జిల్లా కమిటీలు లేవని, వాటిని వేస్తామని తెలిపారు.. ఫిబ్రవరి రెండవ వారంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు అని అంటున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 14 నియోజకవర్గాలు స్వల్ప తేడాతో ఓటమి చెందామని ఆయన వ్యాఖ్యానించారు. ఈ నియోజకవర్గాల లో పటిష్టంగా పని చేసి ఉంటే గెలిచే వాళ్ళమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు . లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీల సత్తా ఏంటో ప్రజలు చూపిస్తారని, అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించి తప్పు చేశామని ఇప్పటికే ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. అంతేకాదు.. కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజాప్రతినిధులకు అవమానం జరుగుతోందని అన్నారు. ఎన్నికలు నిర్వహించకపోతే సర్పంచుల పదవీ కాలం పొడిగించండని కోరారు.

## టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్‌గా మహేందర్‌రెడ్డి నియామకం



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన ఛైర్మన్‌గా మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. మహేందర్‌రెడ్డి నియామకానికి గవర్నర్ తమిళిసై ఆమోదం తెలిపారు. టీఎస్‌పీఎస్సీ సభ్యులుగా విశ్రాంత ఐఏఎస్ అనితా రాజేంద్రన్, అమీరుల్లా ఖాన్, ప్రొఫెసర్ నర్రి యాదయ్య, రామ్మోహన్‌రావు, పాల్వాయి రజనీకుమారిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. గతంలో ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో టీఎస్‌పీఎస్సీపై పెద్దఎత్తున విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పరీక్షలను పారదర్శకంగా, కట్టుదిట్టంగా నిర్వహించాలని నిర్ణయించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఛైర్మన్ బాధ్యతలను విశ్రాంత ఐపీఎస్‌కు అప్పగించాలని నిర్ణయించారు. దీంతో ఛైర్మన్, సభ్యుల నియామకాలకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. ఛైర్మన్ పదవి కోసం సుమారు 50 మంది దరఖాస్తు చేసుకోగా.. చివరికి మహేందర్‌రెడ్డిని ప్రభుత్వం ఖరారు చేస్తూ దస్త్రాన్ని గవర్నర్‌కు పంపగా.. ఆమె ఆమోదం తెలిపారు.

**మహేందర్ రెడ్డి గురించి క్లుప్తంగా..**

1986 బ్యాచ్‌కి చెందిన మహేందర్‌రెడ్డి స్వస్థలం ఉమ్మడి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కిష్టాపురం గ్రామం. మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన ఏకో పాధ్యాయ పాఠశాలలోనే చదువుకున్నారు. రామగుండం ఏఎస్పీగా తొలుత బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత నిజామాబాద్, కర్నూలు ఎస్పీగా పనిచేశారు. ఐదేళ్లపాటు జాతీయ పోలీసు అకాడమీలో బాధ్యతలు నిర్వహించిన ఆయన చంద్రబాబునాయుడు హయాంలో ఏర్పాటు చేసిన సైబరాబాద్ కమిషనరేట్‌కు మొదటి కమిషనర్‌గా నియమితులయ్యారు. ఇక్కడ ఆయన పోలీసుశాఖలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. మూడేళ్లపాటు సుదీర్ఘంగా సైబరాబాద్ కమిషనర్‌గా పనిచేసిన ఆయన ఆ తర్వాత గ్రేహౌండ్స్, పోలీసు కంప్యూటర్స్ విభాగాల్లో విధులు నిర్వహించారు. కీలకమైన నిఘా విభాగాధిపతిగానూ పనిచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత హైదరాబాద్ కమిషనర్‌గా నియమితులయ్యారు. స్నేహపూర్వక పోలీసింగ్ పేరుతో అనేక ప్రయోగాలు చేయడంతో పాటు పోలీస్ స్టేషన్లను ఆధునికీకరించడంలో విశేష కృషిచేశారు. అనంతరం 2017 నవంబర్‌లో తెలంగాణ డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన మహేందర్ రెడ్డి 2022 డిసెంబర్ వరకు ఆ పదవిలో కొనసాగారు.




## పాడి కౌశిక్ రెడ్డిపై గవర్నర్ తమిళిసై సీరియస్

ఎన్నికల ప్రచారం సందర్భంగా అభ్యర్థులు చేసే వ్యాఖ్యలపై గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్ జేఎన్టీయూలో జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓటు వేయడం మనందరి బాధ్యత, హక్కు అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘానికి అండగా ఉండటం తన బాధ్యత అని తెలిపారు. పోలింగ్ రోజు ఇచ్చే సెలవును ఓటు హక్కు కోసం వాడుకోవాలన్నారు. సాధారణ పౌరుడిని అసాధారణ శక్తిగా చేసేదే ఓటు హక్కు అని గుర్తు చేశారు. విదేశాలకు వెళ్లేందుకు వీసా కోసం లైన్‌లో ఉంటారు. అలాగే ఓటు కోసం కూడా లైన్‌లో ఉండాలని యువతకు సూచించారు. అభ్యర్థులను పూర్తిగా విశ్లేషించి ఓటు వేయాలన్నారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పేరు ప్రస్తావించకుండానే ఆయనపై గవర్నర్ సీరియస్ అయ్యారు. ఓటు వేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానని.. ఓ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. ఎన్నికలను ప్రభావితం చేసే అభ్యర్థుల వ్యాఖ్యలపై ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లను ఎవరూ ఒత్తిడి చేయొద్దన్నారు. ఓటు అనేది ప్రధాన ఆయుధం అన్నారు. ప్రజాస్వామ్యం బతకాలి అంటే ఓటు వేయాలన్నారు. ‘ఓట్’ అనే పుస్తకాన్ని గవర్నర్ ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా హుజురాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న పాడి కౌశిక్ రెడ్డి కమలాపూర్ రోడ్డు షోలో మాట్లాడుతూ.. ‘ఓటు వేసి దీవిస్తే జైత్రయాత్ర.. గెలిపించకపోతే మా కుటుంబ సభ్యుల శవయాత్ర’ అని సంచలన వ్యాఖ్యలు చేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

## ఆర్టికల్ 370 రద్దు.. 66 శాతం తగ్గిన ఉగ్ర ఘటనలు: అమిత్ షా



శ్రీనగర్: జమ్మూ-కశ్మీర్‌లో ఆర్టికల్ 370 ) రద్దు అనంతరం ఉగ్రవాద సంబంధిత ఘటనలు 66 శాతం తగ్గుముఖం పట్టినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. పౌర హత్యల్లో 81 శాతం, భద్రత సిబ్బంది మరణాల్లో 48 శాతం తగ్గుదల నమోదైనట్లు తెలిపారు. స్థానికంగా శాంతియుత వాతావరణం ప్రారంభమైందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ ప్రాంతం ఉగ్రవాదం నుంచి పర్యాటకం వైపు మళ్లుతోందన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జమ్మూలో 100 ఈ-బస్సులకు అమిత్ షా పచ్చజెండా ఊపారు. స్థానికంగా ప్రభుత్వ, కారుణ్య ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక యువత ఓటర్లుగా నమోదు చేసుకుని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగం కావాలని విజ్ఞప్తి చేశారు.

**జోడోయాత్రలో రాహుల్‌గాంధీ డూప్: అస్సాం సీఎం**

“2000లో 2,654 రాళ్ల దాడి ఘటనలు జరిగాయి. 2010లో రాళ్ల దాడుల్లో 112 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. 2023లో ఇటువంటివి ఒక్కటీ చోటుచేసుకోలేదు. స్థానికంగా ఉగ్ర కార్యకలాపాలకు నిధుల ప్రవాహాన్ని అరికట్టాం. ఆస్తులను అటాచ్ చేస్తున్నాం. అనేక ఉగ్ర సంస్థలపై నిషేధం విధించాం. బాంబు పేలుళ్లు, కాల్పులు, బంద్‌లు.. విద్యాసంస్థలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలతో భర్తీ అవుతున్నాయి. ఇది అతిపెద్ద మార్పు. 2019-20లో జమ్మూ- కశ్మీర్‌కు రూ.297 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 2022-23లో రూ.2,153 కోట్లకు పెరిగాయి. మరో రూ.6,000 కోట్లు రానున్నాయి” అని అమిత్ షా తెలిపారు. జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ‘ఆర్టికల్ 370’ని 2019 ఆగస్టు 5న కేంద్రం రద్దు చేసింది. రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలు(జమ్మూ- కశ్మీర్, లద్ధాఖ్)గా విభజించింది.

## శ్రీరంగవరం, లింగాపూర్ గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాల ప్రారంభం

### గ్రామాల్లో సర్పంచ్ ల పాలన బాగుంది - మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



**మేడ్చల్, జనవరి 25 (తెలంగాణ చేతనం):**

గత 5 సంవత్సరాలుగా సర్పంచులు మంచి పాలన అందించారని మాజి మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండలం శ్రీరంగవరం గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనం, లింగాపూర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ, డ్వాక్రా భవనాలను ప్రారంభించడం తో పాటు లింగాపూర్, బర్మాజిగూడ గ్రామాలలో నూతన అంబేద్కర్ విగ్రహాలను విగ్రహాలను మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సంధర్బంగా మల్లారెడ్డి మాట్లాడుతూ మేడ్చల్ మండలంలోని ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగు, సాగు నీరు, డంపింగ్ యార్డు, గ్రేవ్ యార్డు, నర్సరీలు వంటి అభివృద్ధి కార్యక్రమాలలో సర్పంచులు, ఎంపిటిసిలు చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. గత 5 సంవత్సరాల్లో అప్పటి సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందన్నారు. 5 సంవత్సరాలుగా గ్రామల అభివృద్ధి కి కృషిచేసిన సర్పంచ్ లను, ఎంపిటిసిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శైలజ విజయానందారెడ్డి, ఎంపిపి రజిత రాజమల్లారెడ్డి, వైస్ ఎంపిపి వెంకటేశం, ఎంపీడీఓ పద్మావతి, మేడ్చల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్, మేడ్చల్, డబిల్ పూర్ పిఏసిఎస్ ఛైర్మన్ లు రణధీప్ రెడ్డి, సురేష్ రెడ్డి, శ్రీరంగవరం గ్రామ సర్పంచ్ విజయానందారెడ్డి, లింగపూర్ గ్రామ సర్పంచ్ బైరి లక్ష్మీ సంజీవయ్య, ఎంపిటిసి హేమలత, ఆయా గ్రామల సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, అంబేద్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఫిబ్రవరి 8న పాక్ ఎన్నికలు...

# 'బ్యాట్' పట్టని ఇమ్రాన్!

వచ్చే నెల 8న పాకిస్తాన్ సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. అవినీతి కేసులతో ప్రస్తుతం జైల్లో ఉన్న పాక్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ (71) సొంత రాజకీయ పార్టీ పేరు పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ). దీని ఎన్నికల చిహ్నం- క్రికెట్ బ్యాట్. మరో రెండు వారాల్లో జరగనున్న దేశ సాధారణ ఎన్నికల్లో క్రికెట్ బ్యాట్ ఎన్నికల గుర్తును వాడకుండా పీటీఐపై దేశ ఎన్నికల సంఘం నిషేధం విధించింది. ఎన్నికల నేపథ్యంలో దేశవ్యాప్తంగా రాజకీయ వేడి మొదలైంది. రాజకీయ పార్టీలన్నీ ప్రచారానికి శ్రీకారం చుట్టాయి. తమ ఎన్నికల గుర్తు మీద ఈసీ నిషేధం విధించడంపై ఇమ్రాన్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీన్ని పీటీఐ ఓటమికి కోసం మిలిటరీ మద్దతున్న ఆపద్ధర్మ ప్రభుత్వం పన్నిన కుట్రగా ఇమ్రాన్ మద్దతుదారులు అభివర్ణిస్తున్నారు. ఇమ్రాన్ పార్టీ పీటీఐ నిబంధనల ప్రకారం అంతర్గత ఎన్నికలు నిర్వహించనందునే ఎన్నికల గుర్తు వినియోగంపై ఆంక్షలు విధించామని ఎన్నికల సంఘం అంటోంది. వాస్తవానికి గత సంవత్సరం జూన్ 8న ఇమ్రాన్ పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించింది. అయితే సజావుగా జరగలేదంటూ ఆ ఎన్నికలను గుర్తించడానికి పాక్ ఎన్నికల సంఘం నిరాకరించింది. ఈసీ చర్య అన్యాయం, అక్రమం, రాజకీయ దురుద్దేశపూరితమని, ఇదంతా ఎన్నికల్లో తమ పార్టీ విజయాన్ని నిరోధించేందుకేనని ఇమ్రాన్ మద్దతుదారులు ఆక్రోశిస్తున్నారు. 13 చిన్నాచితకా రాజకీయ పార్టీల విషయంలోనూ ఈసీ ఇలాంటి ఉత్తర్వులే వెలువరించింది.

ఎన్నికల చిహ్నంపై నిషేధాన్ని తొలగించుకునేందుకు పీటీఐ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ వారికి చుక్కెదురైంది. ఈసీ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. పీటీఐకి ఈ తీర్పు శరాఘాతంలా తగులుతోంది. ఎన్నికల్లో పార్టీ గుర్తులను రాజకీయ పార్టీలు కోల్పోవడం పాకిస్తాన్లో కొత్తేమీ కాకపోయినప్పటికీ, పీటీఐ తమ అభ్యర్థులందరికీ ఇతరత్రా ఓ గుర్తును ఎంచుకునే సమయం, అవకాశం సైతం లేకుండా పోయింది. అందుకు ఉద్దేశించిన నిర్ణీత గడువు ముగిసింది. చిహ్నాల్ని మార్చే ప్రక్రియ ఇంకా కొనసాగితే ఎన్నికల నిర్వహణలో మరింత జాప్యం జరుగుతుందని ఈసీ చెబుతోంది. ఈ గందరగోళాన్ని తొలగించేలా తమ పార్టీ అభ్యర్థుల పేర్లు-చిహ్నాలను ఓటర్లు అన్వేషించేందుకు వీలుగా ఇమ్రాన్ పార్టీ సామాజిక మాధ్యమాల బృందం ఓ పోర్టల్ నడుపుతోంది. పాకిస్తాన్లో సగం మంది ప్రజలకే స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి. దీంతో ఓటర్ల వద్దకు చేరడంలో ఇమ్రాన్ పార్టీ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఏదేమైనా క్రికెట్ బ్యాట్ గుర్తును కోల్పోవడం తమ పార్టీ విజయావకాశాల్ని దెబ్బతీస్తుందని పీటీఐ నేతలు ఆందోళన చెందుతున్నారు.



క్రికెట్ మీద మహా మోజున్న పాక్ లాంటి దేశంలో ఓటర్లను ఇమ్రాన్ పార్టీ వైపు ఆకర్షించడానికి బ్యాట్ గుర్తు సమ్మోహనాస్త్రంలా ఉపయోగపడింది.

**'త్రాసు' కోసం న్యాయపోరాటం!**

క్రికెట్ బ్యాట్ గుర్తుతో ఇమ్రాన్ రాజకీయ పార్టీ పీటీఐకి విడదీయరాని అనుబంధం ఉన్నప్పటికీ నిజానికి దాని తొలి ఎన్నికల గుర్తు 'దీపం'. పీటీఐ పేరులోని 'ఇన్సాఫ్' అంటే ఉర్దూలో న్యాయం అనే అర్థం వస్తుంది. 2013 ఎన్నికలకు ముందు పీటీఐ న్యాయానికి ప్రతీకగా 'సమ త్రాసు' గుర్తును వాడుకోవాలని భావించింది. కానీ, 'సమ త్రాసు' 1970 సాధారణ ఎన్నికల్లో జమాతే ఇస్లామీ పార్టీ గుర్తుగా ఉంది. ఈ గుర్తు కోసం ఇరు పార్టీల మధ్య సాగిన న్యాయపోరాటంలో చివరికి జమాతే ఇస్లామీ పార్టీదే పైచేయి అయింది. 1977 సార్వత్రిక ఎన్నికల అనంతరం జనరల్ జియా-ఉల్-హక్ నేతృత్వంలోని సైనిక సర్కారు కొన్ని ఎన్నికల చిహ్నాల్ని ఆమోదిత జాబితా నుంచి తొలగించింది. అలా తొలగించిన వాటిలో త్రాసు గుర్తు ఉంది. తర్వాత 2010 సంవత్సరంలో పాకిస్తాన్ ఎన్నికల సంఘం త్రాసు గుర్తును పునరుద్ధరించింది. పాక్ ఎన్నికల్లో గుర్తుల ప్రాధాన్యం అంతాఇంతా కాదు. "పాకిస్తాన్ జనాభాలో 40% మంది నిరక్ష్యరాస్యులు. విద్యావంతులు కాని ఓటర్లు ఓటు వేయడానికి గుర్తులపై ఆధారపడతారు, పేర్లు చదవగలిగిన పౌరుల్లోనూ చాలామంది ఎల్లప్పుడూ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనరు. కానీ వారికి పార్టీ గుర్తు మాత్రం తెలుసు" అని 'జియో' జర్నలిస్టు మాలిక్ వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారాల్లోని నినాదాలు, గీతాలు వాటి గుర్తుల చుట్టూ అల్లుకుని వుంటాయి అని ఆమె చెప్పారు. ప్రస్తుతం రాజకీయ పార్టీలకు 150 గుర్తులు కేటాయించగా మరో 174 గుర్తుల్ని స్వతంత్ర అభ్యర్థులకు ఇస్తున్నారు. మూడు సార్లు దేశ ప్రధాన మంత్రిగా పనిచేసిన నవాజ్ షరీఫ్ (74) ఆధ్వర్యంలోని పాకిస్తాన్ ముస్లిం లీగ్ (ఎన్) పార్టీ పులి గుర్తుతో, మాజీ ప్రధాని బేనజీర్ భుట్టో తనయుడు బిలావల్ భుట్టో జర్దారీ సారథ్యంలోని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) బాణం గుర్తుతో ఎన్నికల బరిలోకి దిగుతున్నాయి.

**మిలిటరీ మ్యాన్ నవాజ్ షరీఫ్!**

ప్రజాదరణ ఎంత బలంగా ఉన్నప్పటికీ రాజకీయ క్రీజులో ఇమ్రాన్ ఖాన్ మళ్లీ ఫామ్ లోకి రావడం దుర్లభం గానే కనిపిస్తోంది. ఇంత ఎదురుగాలిలోనూ గత డిసెంబరులో నిర్వహించిన ఓ ఒపీనియన్ పోల్ ప్రకారం... నవాజ్ షరీఫ్ (52%)తో పోలిస్తే ఇమ్రాన్ ఖాన్ (57%)కే అధిక అప్రూవల్ రేటింగ్స్ దక్కడం విశేషం. పీటీఐని అణచివేసేందుకు మిలిటరీ ట్రిక్స్ ప్రయోగిస్తోంది. ఇటీవలి కాలంలో పీటీఐ కార్యకర్తలు పలువురు అరెస్టయ్యారు. కొందరు నేతలు 'ఇంటరాగేషన్స్' తట్టుకోలేక పార్టీకి రాజీనామాలు చేశారు. ప్రధాన సమాచార మాధ్యమాల్లో ఇమ్రాన్ పేరు ఉచ్చరించడాన్ని నిషేధించారు. ఆయన నామినేషన్ పత్రాలను తిరస్కరించారు. చివరికి... ప్రతిపాదించేవారు, బలపరిచేవారు దొరక్క (కిడ్నాప్స్/ అపహరణలకు గురై)... ఇమ్రాన్ పార్టీ అభ్యర్థుల నామినేషన్లు కూడా పెద్ద సంఖ్యలో (దాదాపు 90%) తిరస్కృతికి గురయ్యాయి. నవాజ్ షరీఫ్ పాక్ మిలిటరీ నుంచి సహకారం పొందుతున్నారు. పాక్ ప్రధానమంత్రి పీఠంపై కూర్చొని పూర్తి పదవీకాలాన్ని అనుభవించిన వారెవరూ లేరు. ఆ అదృష్టం తొలిసారిగా, నాలుగో విడతలో షరీఫ్ ను వరిస్తుందేమో చూడాలి.

**మిలిటరీతో షరీఫ్ ఒప్పందం: బిలావల్**

తూర్పు పంజాబ్ ప్రావిన్సులో పోటీ చేస్తున్న తమ పార్టీ జాతీయ, అసెంబ్లీ అభ్యర్థులకు తప్పుడు ఎన్నికల గుర్తులు కేటాయించారని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) నేత బిలావల్ భుట్టో-జర్దారీ అంటున్నారు. నవాజ్ షరీఫ్ ఒత్తిడి మేరకే దేశ ఎన్నికల సంఘం ఇలా వ్యవహరించిందని ఆయన వ్యాఖ్యానించారు. తెర వెనుక ఉంటూ రాజ్యాధికార శక్తుల్ని నియంత్రించే మిలిటరీతో షరీఫ్ ఒప్పందం కుదుర్చుకున్నారని బిలావల్ ఆరోపిస్తున్నారు. కొన్నేళ్లు స్వయం ప్రకటిత ప్రవాసం గడిపి నిరుడు అక్టోబరులో స్వదేశానికి వచ్చిన నవాజ్ షరీఫ్... బిలావల్ ఆరోపణలను కొట్టిపారేశారు. అవినీతి కేసుల్లో పదవి నుంచి 2017లో ఉద్వాసనకు గురై పదేళ్ళ జైలు శిక్ష పడిన నవాజ్ షరీఫ్... వైద్యచికిత్స కోసమంటూ బెయిల్ మీద లండన్ వెళ్ళి అక్కడే (పరారై ప్రవాసం) తలదాచుకున్నారు. ఆయన అకస్మాత్తుగా నిరుడు అక్టోబరు 21న స్వదేశానికి విచ్చేశారు. 'అవినీతి మరకల్ని, రాజకీయాల నుంచి శాశ్వత నిషేధాన్ని' వదిలించుకుని 4వ సారి ప్రధాని అయ్యే ఆశతో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.

# ఇండియా కూటమిలో ఐక్యతాలోపం..



**చంఢీగర్:** ఇండియా కూటమికి డబుల్ షాక్ తగిలింది. పంజాబ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో ఆప్ సొంతంగానే పోటీ చేస్తుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తెలిపారు. రాష్ట్రంలో తమకు కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తు లేదని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్‌తో పొత్తు ఉండబోదని సీఎం మమతా బెనర్జీ చెప్పిన కొన్ని గంటల తర్వాత భగవంత్ మాన్ కూడా పొత్తుపై స్పష్టతనిచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగా పోరాడాలని ఆప్ పంజాబ్ వర్గం చేసిన ప్రతిపాదనకు కేజ్రీవాల్ ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలు ఇప్పటికే తెలిపాయి. రాష్ట్రంలో మొత్తం 13 లోక్‌సభ స్థానాల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ఇండియా కూటమికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ భారీ షాక్ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో బెంగాల్ నుంచి తమ పార్టీ ఒంటరిగా పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్‌తో ఎలాంటి సంబంధాలు లేవని.. ఆ పార్టీతో తాము పొత్తు పెట్టుకోబోమని స్పష్టం చేశారామె. ఇండియా కూటమిలో భాగంగా.. కాంగ్రెస్‌తో జరిపిన సీట్ల పంపకం చర్చలు విఫలమయ్యాయని ఆమె తెలిపారు. 'మేము వారికి ఏ ప్రతిపాదన ఇచ్చినా, వారు అన్నింటినీ తిరస్కరించారు. ఇక మాకు కాంగ్రెస్‌తో ఎలాంటి సంబంధాలు లేవు... బెంగాల్‌లో ఒంటరిగానే పోరాడతాం. ఎన్నికల తర్వాత అఖిల భారత స్థాయిలో నిర్ణయం తీసుకుంటాం' అని అన్నారు.

**కాంగ్రెస్ పార్టీతో పొత్తు లేదు..**

ఇండియా కూటమిలో కొనసాగే విషయంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ బుధవారం సంచలన ప్రకటన చేశారు. కూటమిలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకోబోమని, ఆ పార్టీతో తమకు ఎలాంటి సంబంధాలు లేవని తేల్చిచెప్పారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోరాడతామని స్పష్టం చేశారు. బెంగాల్ లోని 42 లోక్ సభ నియోజకవర్గాల్లో టీఎంసీ పోటీ చేస్తుందని వివరించారు. ఎన్నికల ఫలితాల తర్వాత పొత్తులపై, ఇండియా కూటమి గురించి ఆలోచిస్తామని మమతా బెనర్జీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రపైనా దీదీ విమర్శలు గుప్పించారు. బెంగాల్ లోకి యాత్ర ఎంటర్ కాబోతోందని గుర్తుచేస్తూ కూటమి భాగస్వామిగా ఉన్న తమకు మర్యాదపూర్వకంగా కూడా సమాచారం ఇవ్వలేదని దుయ్యబట్టారు. దీంతో రాహుల్ గాంధీ యాత్రలో మమత పాల్గొనడం సందేహాస్పదంగా మారింది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా మెజారిటీ ప్రతిపక్షాలు ఇండియా కూటమిగా ఏర్పడిన విషయం తెలిసిందే. బీజేపీపై ఐక్యంగా పోరాడాలనే నిర్ణయంలో భాగంగా ఈ కూటమి ఏర్పడింది. కూటమిలోని ప్రధాన పార్టీలలో ఒకటిగా టీఎంసీ వ్యవహరించింది. పలుమార్లు చర్చల అనంతరం కూటమిలో ప్రస్తుతం సీట్ల పంపకాలపై కసరత్తు జరుగుతోంది. ఈ విషయంలోనే కాంగ్రెస్, టీఎంసీల మధ్య భేదాభిప్రాయాలు తలెత్తినట్లు రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. బెంగాల్ లో మొత్తం 42 లోక్ సభ స్థానాలు ఉండగా.. ఏ పార్టీ ఎన్నిచోట్ల పోటీ చేయాలనే విషయంపై ఇరుపార్టీల నేతలు చర్చలు జరిపినట్లు సమాచారం. అయితే, సీట్ల పంపకం విషయంలో కాంగ్రెస్, టీఎంసీల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదని తెలుస్తోంది. బెంగాల్ లో కాంగ్రెస్ పార్టీకి కేవలం రెండు సీట్లను మమత ఆఫర్ చేశారని, మరిన్ని సీట్లు కావాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో ఏర్పడిన భేదాభిప్రాయాలతోనే టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ తాజా ప్రకటన చేసినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**మమతా లేని ఇండియా కూటమిని ఊహించలేము**

లోక్‌సభ ఎన్నికల్లో పోటీపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిర్ణయంపై ప్రతిపక్ష ఇండియా కూటమి అయోమయ స్థితిలో పడేసింది. బెంగాల్‌లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు లేకుండా తృణమూల్ కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తుందన్న మమతా ప్రకటనతో కూటమిలోని పార్టీలో టెన్షన్ మొదలైంది. దిది నిర్ణయంపై తాజాగా కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేష్ మాట్లాడుతూ.. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ లేని ఇండియా కూటమిని ఊహించలేమని అన్నారు, ఈ మేరకు బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కూటమికి టీఎంసీ బలమైన పిల్లర్‌గా అభివర్ణించారు. భవిష్యత్తులో టీఎంసీతో సీట్ల పంపకాల చర్చలు ఫలప్రదంగా ఉంటాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. బీజేపీని ఓడించాలని మమతా బెనర్జీ అన్నారు. ఓడించేందుకు మేము ఏమైనా చేస్తాం. మమతా బెనర్జీ, టీఎంసీ పార్టీ భారత కూటమికి బలమైన మూల స్తంభాలని రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారు. దిది లేని భారత కూటమిని మనం ఊహించలేం. ఈ కూటమి పశ్చిమ బెంగాల్‌లో కూటమిలా పోరాడుతుంది. రాహుల్ భారత్ జోడో న్యాయ యాత్రలో భాగమయ్యేందుకు ఇండియా కూటమిలోని అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నట్లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చాలాసార్లు కోరారు' అని తెలిపారు. సీట్ల పంపకాలపై చర్చలు జరుగుతున్నాయన్న జైరాం రమేష్.. పశ్చిమ బెంగాల్‌లో భారత కూటమి ఏకమై ఎన్నికల్లో పోటీ చేస్తుందని, దానిపై తమకు పూర్తి విశ్వాసముంది. బీజేపీని ఓడించేందుకు తాము ఏ అవకాశాన్ని వదలదని ఆయన అన్నారు. అదే ఆలోచనతో ప్రస్తుతం అస్సాంలో ఉన్న భారత్ జోడో న్యాయ్ యాత్ర పశ్చిమ బెంగాల్‌లోకి ప్రవేశిస్తుందని అన్నారు.

కాగా లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కార్‌ను గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు ఇండియా కూటమిగా ఏర్పడిన విషయం తెలిసిందే. ఖర్గే అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఈ కూటమిలో తృణమూల్ కాంగ్రెస్ కూడా భాగమే. ప్రస్తుతం ఎన్నికల కోసం కూటమిలోని పార్టీల మధ్య సీట్ల పంపకాల విషయంలో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మమతా తాజాగా ప్రకటన చేయడం అధికార బీజేపీని పడగొట్టేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలకు భారీ ఎదురుదెబ్బ తగిలేలా కనిపిస్తోంది. అయితే మమతా బెనర్జీ అవకాశవాది అంటూ, ఆమె సహాయం లేకుండానే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేస్తుందని ఆ పార్టీ నేత అధిర్ రంజన్ చౌదరి బెంగాల్ సీఎంపై విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. ఇది జరిగిన మరుసటి రోజే మమతా నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కేంద్ర మంత్రులు అయోధ్యకు వెళ్లకండి



**లక్నో:** ఫిబ్రవరిలో అయోధ్యను సందర్శించడం మానుకోవాలని కేబినెట్ మంత్రులను ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. జనవరి 22న ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగిన తర్వాత భక్తులు భారీ సంఖ్యలో రామమందిరానికి తరలి రావడంతో మోదీ ఈ మేరకు మంత్రులకు విజ్ఞప్తి చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీంతో కేంద్ర మంత్రులు మార్చి నెలలో అయోధ్యను సందర్శించనున్నట్లు తెలుస్తోంది. వీఐపీల సందర్శనలో ప్రోటోకాల్‌ల వల్ల భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అయోధ్యకు వెళ్లే ప్రణాళికను మంత్రులు వాయిదా వేసుకోవాలని ప్రధాని మోదీ కోరినట్లు తెలుస్తోంది. అయోధ్య రామమందిర నిర్మాణంపై ప్రజల అభిప్రాయాన్ని కూడా ప్రధాని మోదీ మంత్రులను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. సోమవారం అయోధ్య ఆలయంలో బాలరాముని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ నాయకత్వం వహించారు. ఈ వేడుకను దేశవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం చేశారు. అగ్రశ్రేణి రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, క్రీడాకారులు, సెలబ్రిటీలతో సహా అనేక వేల మందిని కార్యక్రమానికి ఆహ్వానించారు. సంప్రోక్షణ కార్యక్రమం ముగిసిన వెంటనే ఆహ్వానితులు దేవుడి దర్శనం చేసుకున్నారు. సాధారణ ప్రజల కోసం మంగళవారం ఉదయం ఆలయ తలుపులు తెరవబడ్డాయి. మొదటి రోజు దాదాపు ఐదు లక్షల మంది భక్తులు ఆలయాన్ని సందర్శించారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు బారులు తీరారు. భక్తులు భారీగా తరలిరావడంతో మంగళవారం దర్శనానికి కొద్దిసేపు విరామం ఇవ్వాల్సి వచ్చింది.

## రోడ్డు ప్రమాదంలో దీదీ తలకు గాయం



**కోల్‌కతా:** రోడ్డు ప్రమాదంలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ గాయపడ్డారు. పర్యటనలో భాగంగా బర్ధమాన్ నుంచి కోల్‌కతాకు తిరిగి వస్తుండగా ఆమె ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ప్రతికూల వాతావరణం కారణంగా ఆమె కారులో ప్రయాణించాల్సి వచ్చింది. ఈ క్రమంలో ప్రమాదం జరిగింది. ప్రతికూల వాతావరణం కారణంగా మమతా బెనర్జీ కారులో బర్ధమాన్ నుంచి తిరిగి వస్తున్నారు. ఆమె ప్రయాణిస్తున్న కాన్వాయ్‌కి ఎదురుగా అకస్మాత్తుగా మరో కారు వచ్చింది. దీంతో డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్‌లు వేయడంతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గాయపడ్డారు. దీదీ తలకు స్వల్ప గాయాలు కాగా.. ఆమెను కోల్‌కతాకు తీసుకువస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## కుప్పకూలిన రష్యా యుద్ధ విమానం..

## 65 మంది ఉక్రెయిన్ ఖైదీలు దుర్మరణం



**మాస్కో:** రష్యా యుద్ధ విమానం కుప్పకూలింది. రష్యా-ఉక్రెయిన్ సరిహద్దులో ఈ ఘోర ప్రమాదం జరిగింది. 65 మంది ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలు దుర్మరణం చెందారు. ఆరుగురు సిబ్బంది, మరో ముగ్గురు వ్యక్తులు ఉన్నారని రక్షణ మంత్రిత్వ శాఖను వెల్లడించింది. ప్రమాదానికి కారణాలు ఇంకా సమాచారం లేదు. రష్యాకు చెందిన ఇల్యుషిన్ %×శ్రీ%-76 సైనిక రవాణా విమానంగా అధికారులు గుర్తించారు. బెల్గోరోడ్ నగరానికి ఈశాన్య ప్రాంతంలో ఈ ఘటన సంభవించిందని స్థానిక గవర్నర్ వ్యాచెస్లావ్ గ్లాడ్కోవ్ మాట్లాడారు. తాను ఆ స్థలాన్ని పరిశీలించబోతున్నానని చెప్పారు. అత్యవసర సహాయ సిబ్బంది ఇప్పటికే సంఘటనా స్థలానికి చేరుకున్నారని ఆయన చెప్పారు.

## కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య..

## ఈ ఏడాది ఇదే ప్రథమం



**జైపూర్:** కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లో ఇంజినీరింగ్ కోసం సిద్ధమవుతున్న ఓ విద్యార్థి మంగళవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోటీ పరీక్షల కేంద్రంగా పేరొందిన కోటాలో గత ఏడాది 29 ఆత్మహత్య ఘటనలు చోటుచేసుకోవడం గురించి తెలిసిందే. కాగా.. ఈ ఏడాది ఇదే తొలి విద్యార్థి ఆత్మహత్య. యూపీలోని మొరాదాబాద్‌కు చెందిన మహ్మద్ జైద్(18) అనే విద్యార్థి కోట హాస్టల్‌లో ఉంటూ జేఈఈ మెయిన్స్ కోచింగ్‌లో చేరాడు. మంగళవారం అర్ధరాత్రి గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా ప్రదేశంలో సూసైడ్ నోట్ లాంటివి కనిపించలేదు. ఆత్మహత్యకు గల కారణాలు స్పష్టంగా తెలియదు. ఈ ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రాత్రి 11:00 ఈ ఘటనపై స్పందించిన పోలీసులు.. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కోటాలో 2023లో 29 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కోచింగ్ సెంటర్‌ల అధిక ఒత్తిడి కారణంగా విద్యార్థులు మానసికంగా ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయినప్పటికీ ఈ ఆత్మహత్యలు తగ్గడం లేదు.

## మేడ్చల్ పట్టణంలో జాతీయ ఓటర్ దినోత్సవం




**మేడ్చల్, జనవరి 25 (తెలంగాణ చేతనం):** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మునిసిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహా రెడ్డి , కమిషనర్ టి ఎస్ వి ఎన్ త్రిల్లేశ్వర్ ల ఆద్వర్యం లో పట్టణంలోని స్ఫూర్తి కళాశాల నుండి వివేకానంద స్థూపం వరకు విద్యార్థులు, పట్టణ ప్రజలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించి , పట్టణ పౌరులచే, విద్యార్థులచే ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్ వో రాంచందర్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్ రెడ్డి, మెప్మా సి వో నరేష్, ఆర్ పి లు మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అదనపు సిబ్బంది కొరకు తాసిల్దార్‌కు వినతి పత్రం



**శామీర్ పేట్, జనవరి 25 (తెలంగాణ చేతనం):** కాల్వల నిర్వహణ కొరకు సిబ్బందిని ఏర్పాటు చేయాలని శామీర్ పేట్ తహసిల్దార్ కి అలియాబాద్ సర్పంచ్ గుర్క కుమార్ యాదవ్ గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్బంగా సర్పంచ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ అలియాబాద్ గ్రామ పరిధిలో రెండు పంట కాలువల నిర్వహణకు సిబ్బంది సరిపోవడం లేదని, ఇద్దరు సిబ్బందిని కేటాయించాలని కోరారు. ఇద్దరు సిబ్బందిని నియమించడం వల్ల శామీర్ పేట్ పెద్ద చెరువు నుండి అలియాబాద్, జగ్గన్ గూడ గ్రామాల రైతులకు చాలా ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## హలీం హౌస్ ను ప్రారంభించిన కౌన్సిలర్ కౌడే మహేష్



**మేడ్చల్, జనవరి 25 (తెలంగాణ చేతనం):** మేడ్చల్ పట్టణంలో గల ఇందిరాగాంధీ విగ్రహం ప్రక్కన మహమ్మద్ ఆదిల్, మహమ్మద్ షాను లు నిర్వహించిన హలీమ్ హౌస్ ను కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ ప్రారంభించారు. భోజన ప్రియులకు రుచికరమైన, నాణ్యత గల హలీమ్ ను తయారు చేసి ఇవ్వాలని యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ బీ ఆర్ ఎస్ పార్టీ మైనారిటీ విభాగం అధ్యక్షులు సయ్యద్ లాయక్ ఆలీ(పాషా), మైనారిటీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ రఫీక్, మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆబెద్, మోనార్క్, నాసిర్, అబ్దుల్ సమి, మహమ్మద్ ఖాజా ఖాన్, యూనుస్, లాయక్, బబ్లూ, సోను, అజర్ మేడ్చల్ మున్సిపల్ బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వికాసిత భారత్ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలి

అమరం మోహన్ రెడ్డి



**మేడ్చల్, జనవరి 25 (తెలంగాణ చేతనం):** దక్కన్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో వికసిత భారత్ కార్యక్రమం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగ పాల్గొన అమరం మోహన్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం కోసం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన కార్యక్రమమే వికసిత భారత్ సంకల్ప యాత్ర అని అయన అన్నారు, ఈ సందర్భంగా స్ట్రీట్ వెండర్ అయినటువంటి కొమ్ము సత్యనారాయణకు 50వేల సాన్షన్ లెటర్ ని అందించారు ఈ కార్యక్రమంలో భాజపా మున్సిపల్ అధ్యక్షులు ఉషిగారి శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మెన్ జైతువాలా కిషన్, యువమోర్చ జిల్లా అధికార ప్రతినిధి కావేరి శ్రీధర్, బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ముక్కిడిగల మహేష్, యువమోర్చ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి సుంకు నవీన్, బీజేపీ నాయకుల జైతువాలా కృష్ణ, అభిలాష్, మున్సిపల్ సంబంధిత వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మలిపెద్ది సుధీర్ రెడ్డి కర్ర పెత్తానం...

# ఒంటరైన వజ్రేష్ యాదవ్

- సుధీర్ రెడ్డికి కలిసొచ్చిన వజ్రేష్ ఓటమి...
- వజ్రేష్ ను డమ్మీ చేశారని నియోజకవర్గంలో టాక్
- రేవంత్ మెప్పు కోసం సుధీర్ రెడ్డి పాకులాట...
- అవిశ్వాసం పేరుతో బీఆర్ఎస్ కార్పొరేటర్లకు గాలం
- మేడ్చల్ నియోజకవర్గపరిధిలోని పురపాలికలను
- అస్థిరపర్చేందుకు స్కెచ్ కాంగ్రెస్ నాయకుడి చెప్పుచేతుల్లోకి..
- 40శాతం బీఆర్ఎస్ కార్పొరేటర్లు
- బీఆర్ఎస్ పార్టీలో ఉంటూనే కాంగ్రెస్ కు
- జై కొడుతున్న బీఆర్ఎస్ లీడర్లు, కార్పొరేటర్లు....
- కాపాడుకునే ప్రయత్నం చేయని ఎమ్మెల్యే మల్లారెడ్డి
- మల్లారెడ్డి మౌనంపై సర్వత్రా విమర్శలు...
- సందిగ్ధంలో మేడ్చల్ బీఆర్ఎస్ శ్రేణులు
- కేటీఆర్ దృష్టికి మేడ్చల్ బీఆర్ఎస్ వ్యవహారం



మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలి పెద్ది సుధీర్ రెడ్డి



మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీమంత్రి చామకూర మల్లారెడ్డి



మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్

**మేడిపల్లి జనవరి 25 (తెలంగాణ చేతనం)** దేశంలోనే అతిపెద్ద అసెంబ్లీ నియోజకవర్గం మేడ్చల్ 6 లక్షల పై చిలుకు ఓటర్లు ఉన్న మేడ్చల్ అసెంబ్లీ స్థానం 2023 డిసెంబర్ వరకు టీఆర్ఎస్ పార్టీ కంచుకోట. అయితే ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నియోజకవర్గ పరిధిలో రాజకీయం క్రమంగా వేడెక్కుతుంది. అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు బీఆర్ఎస్ పార్టీలో ఉన్నమాజీ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి చివరి క్షణంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నాడు. కానీ ఎమ్మెల్యే టికెట్ మాత్రం బీసీ నాయకుడైన వజ్రేష్ యాదవ్ అలియాస్ జంగయ్య యాదవ్ దక్కించుకున్నప్పటికీ ఓటమిపాలవడంతో మేడ్చల్ కాంగ్రెస్ లో వజ్రేష్ ప్రభావం క్రమంగా తగ్గుతుండగా.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన సుదీర్ రెడ్డి కర్ర పెత్తానం క్రమంగా పెరుగుతుందని జోరుగా ప్రచారం సాగుతోంది. దీంతో సుదీర్ రెడ్డి వ్యవహారంపై వజ్రేష్ వర్గీయులు గుర్రుగా ఉన్నట్లు సమాచారం.

### ఒంటరైన వజ్రేష్ యాదవ్...?

అసెంబ్లీ ఎన్నికలలో ఓటమిపాలైన బీసీ సామాజిక వర్గానికి చెందిన వజ్రేష్ యాదవ్ ను నియోజకవర్గ పరిధిలో సుదీర్ రెడ్డి అండ్ కో.. డమ్మీ చేశాడని ప్రచారం జరుగుతుంది. ఈ ప్రచారానికి బలం చేకూరేలా.. మేడ్చల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న10 పురపాలికల (మున్సిపాలిటీలు 7), (కార్పోరేషన్ లు 3)లో కొలువుదీరిన బీఆర్ఎస్ పాలకవర్గాలను అవిశ్వాసం పేరుతో అస్థిరపర్చేందుకు గత కొన్ని రోజులుగా సుదీర్ రెడ్డి తీవ్ర ప్రయత్నం ఇస్తున్నట్టు ఇటీవల జరుగుతున్న పరిణామాలతో బహిర్గతం అవుతుంది. అందులో భాగంగా నయానో, బయానో పుచ్చుకుంటున్న బీఆర్ఎస్ కార్పోరేటర్లు సొంత పార్టీ చైర్మన్, మేయర్ లపై అవిశ్వాసానికి సై అంటున్నారు. ఇప్పటికే క్యాంపు రాజకీయాలకు సుదీర్ రెడ్డి తెరలేపారు. అయితే ఈ విషయం తనకు చెప్పకుండానే సుదీర్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని వజ్రేష్ యాదవ్ తన అనుచరుల ముందు వాపోతున్నట్లు సమాచారం. అయితే సీఎం రేవంత్ రెడ్డి మెప్పుకోసం పాకులాడుతూ మేడ్చల్ అసెంబ్లీ పరిధిలోని పురపాలికలలో అవిశ్వాసాల ముసుగులో పంతం నెగ్గించుకొని వజ్రేష్ ను రాజకీయంగా అనచివేసి మేడ్చల్ ను పూర్తిస్థాయిలో తన ఆధీనంలోకి తెచ్చుకునేందుకు సుదీర్ రెడ్డి భారీ స్కెచ్ వేసినట్లు నిజమైన కాంగ్రెస్ నాయకులు బాహాటంగానే పేర్కొంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత తమ్ముడని తనకు తానుగా ప్రచారం చేసుకుంటున్న సుదీర్ రెడ్డి మేడ్చల్ ను తనగుప్పిట్లోకి తెచ్చుకునే ప్రయత్నం కాంగ్రెస్ లో ఎటుదారి తీస్తుందో చూడాలి.

### కాంగ్రెస్ నాయకుడి చెప్పుచేతుల్లోకి...

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం వీచినప్పటికీ.. మేడ్చల్ అసెంబ్లీ స్థానంలో మాత్రం బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి గెలిచారు. అందుకు ప్రధాన కారణం మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న 10 పురపాలికలలోను 100 శాతం గులాబీ పార్టీ పాలవర్గాలే కొలువుదీరాయి. కానీ ప్రస్తుతం మారిన రాజకీయ పరిణాల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్పోరేటర్లు కూడా కాంగ్రెస్ నాయకుడైన సుదీర్ రెడ్డి మాటనే వింటుండటం బీఆర్ఎస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. బీఆర్ఎస్ పార్టీ చైర్మన్, మేయర్ అభ్యర్థులపై అవిశ్వాసం పెట్టాలనుకుంటే సమస్య లేదు. కానీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న సుదీర్ రెడ్డి కనుసన్నల్లో బీఆర్ఎస్ పార్టీ కార్పోరేటర్లు, కౌన్సిలర్లు ఉండటం వెనుక ఉన్న మతలబు ఏమిటనేది అంతుచిక్కడం లేదు.

### మల్లారెడ్డి తీరుతోనే...

బీఆర్ఎస్ పార్టీ పెద్దల ఆదేశాల మేరకు మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని స్థానిక సంస్థల నాయకులు ఐక్యంగా ఉండి మల్లారెడ్డిని గెలిపించారు. కానీ బీఆర్ఎస్ కు అధికారం దక్కని కారణంగా బీఆర్ఎస్ పార్టీ మేయర్లు, చైర్మన్ లు, కార్పోరేటర్లు, కౌన్సిలర్లు కొంత వరకు అభద్రతకు లోనయ్యారు. అయితే బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన మల్లారెడ్డి మళ్లీ ఎంపీగా పోటీ చేస్తానని ప్రచారం చేసుకుంటున్నాడు కానీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు కనీస భరోస కూడా ఇవ్వడం లేదని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. పైగా కొద్ది రోజుల కిందటి వరకు ప్రతి మున్సిపాలిటీలో, ప్రతి కార్పోరేషన్ లోను రెండు గ్రూపులను ఏర్పాటు చేసిన మల్లారెడ్డి వ్యవహారం కారణంగానే నేడు అనేక మంది బీఆర్ఎస్ కార్పోరేటర్లు, కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతూనే కాంగ్రెస్ నాయకుడైన సుదీర్ రెడ్డి ఆదీనంలోకి వెళ్లడం పలు అనుమానాలకు తావిస్తుంది.

### సస్పెండ్ చేయకపోవడానికి కారణం...?

బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ నాయకుడి ఆదేశాలను పాటిస్తున్న కార్పోరేటర్లను, కౌన్సిలర్లను సస్పెండ్ చేయకపోవడానికి కారణాలు ఏమిటని బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చెందుతున్నారు. బీఆర్ఎస్ కార్పోరేటర్ల వెనుక మల్లారెడ్డి ఉన్నట్లు నియోజకవర్గంలో గుసగుసలు వినబడుతున్నాయి. ఇందులో భాగంగానే ముందు తన అనుచరులను కాంగ్రెస్ పార్టీలో చేర్పించి మల్లారెడ్డి తన ఆస్తులను కాపాడుకునేందుకు ఎంపీ ఎన్నికలకు ముందు గానీ, ఆ తర్వాత గానీ కాంగ్రెస్ కండువా కప్పుకుంటాడనే ప్రచారం మేడ్చల్ అసెంబ్లీ పరిధిలో జోరందుకుంది. అందుకే మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే పార్టీ వ్యతిరేకులపై చర్యలు తీసుకుంటామనే ప్రకటన కూడా చేయడం లేదనే ఆరోపణ లున్నాయి.

### కేటీఆర్ దృష్టికి మేడ్చల్ వ్యవహారం...

నగర శివారులో బీఆర్ఎస్ కు బలం ఉన్న మేడ్చల్ అసెంబ్లీ పరిధిలో జరుగుతున్న వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టి సారించినట్లు సమాచారం. నియోజకవర్గ పరిధిలో పార్టీ నాయకులను సమన్వయం చేయకపోగా కనీసం పార్టీ నాయకులను, పురపాలికల పాలకవర్గాలను కాపాడటంపై మల్లారెడ్డి దృష్టి సారించడం లేదని ఇప్పటికే కేటీఆర్ కు సైతం ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. మొత్తంగా వజ్రేష్ యాదవ్ రాజకీయంగా సుదీర్ రెడ్డిని నిలువరించగలుగుతారా..? లేక సుదీర్ రెడ్డిదే పై చేయి అవుతుందా..? మల్లారెడ్డి కనుసన్నల్లోనే బీఆర్ఎస్ కార్పోరేటర్లు కాంగ్రెస్ నాయకుడి గుప్పిట్లోకి వెళ్లారా..? మల్లారెడ్డి కూడా త్వరలోనే పార్టీ మారుతాడా అనేది మరో నెల రోజుల్లోనే తేటతెల్లం అవుతుందని చెప్పవచ్చును.

## ఉద్దెమర్రి నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం

### సర్పంచుల కృషి వల్లే గ్రామాలు అభివృద్ధి
### - మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

**మూడు చింతలపల్లి, జనవరి 25 (తెలంగాణ చేతనం):** సర్పంచ్ ల కృషి వల్లే గ్రామాలు అభివృద్ధి చెందాయని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం ముడుచింతలపల్లి మండలంలోని ఉద్దేమర్రి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవననీ మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఫిల్టర్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. భవనం నిర్మాణం కొరకు సహకరించిన





దాతలను మల్లారెడ్డి శాలువాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే దాతలు ముందుకు రావాలన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ ఛైర్మన్ మధుకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉద్దెమర్రి నర్సింహారెడ్డి, ఎంపిపి హరిక మురళి గౌడ్, గ్రామ సర్పంచ్ యంజల అనూరాధ రవీందర్ రెడ్డి, మూడుచింతలపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్ గౌడ్, సెక్రటరీ మోహన్ సింగ్, వార్డు సభ్యులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆరిఫ్ కు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

**మేడ్చల్ జనవరి 25 (తెలంగాణ చేతనం):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.డి. ఆరీఫ్ దంపతులకు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ నిత్యం ప్రజా సేవలో ముందుండే నాయకుడు ఆరిఫ్ అని కొనియాడారు. ఇలాంటి సేవ చేసే నాయకుడు ప్రతి గ్రామంలో ఉండాలని, ఇళాంటి నాయకులు బాగుంటేనే సామాన్య ప్రజలు బాగుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విగ్నేశ్వర్ రెడ్డి, అక్రమ్ పాషా, శ్రీనివాస్ గౌడ్, మునిగొండ శేఖర్, శ్రీశైలం యాదవ్, జాంగిర్, నాగరాజ్, భవాని వెంకటేశ్ యాదవ్, సందీప్, ప్రవీణ్ గౌడ్, ఫైజాన్, మురళి, ఆకుల రాజు, వినోద్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.




## గుండ్లపోచంపల్లి లో జాతీయ ఓటర్ దినోత్సవం

**మేడ్చల్, జనవరి 25 (తెలంగాణ చేతనం):** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం చైర్ పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కార్యలయం వద్ద, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఎన్నికల్లో స్వచ్ఛయుతంగా ఓటు వేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఆనంతరం విద్యార్థులతో ఓటర్ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి పౌరుడి హక్కు అని దాన్ని వినియోగించుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ రాములు, కౌన్సిలర్లు అమరం సరస్వతి, హంస రాణి, బెరి బాలరాజు, అమరం హేమంత్ రెడ్డి, అమరం జైపాల్ రెడ్డి, మున్సిపాలిటీ సిబ్బంది, బి ఎల్ ఓ లు, ఆర్ పి లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దివ్య నగర్‌లో భారీ అక్రమ నిర్మాణం

### అనుమతులు లేకుండానే గుట్టు చప్పుడు కాకుండా నిర్మాణం...



**ఘట్కేసర్ జనవరి 25 (తెలంగాణ చేతనం)** ఘట్కేసర్ మండలం కాచవాని సింగారం దివ్య నగర్ ఫేజ్ 6, 6ఏ, బి, సి పరిధిలో భారీ అక్రమ నిర్మాణం గుట్టు చప్పుడు కాకుండా కొనసాగించడంతో కఠిన చర్యలకు ఉపక్రమించారు గ్రామపంచాయతీ కార్యాలయ అధికారులు. హెచ్ఎండిఏ నుంచి గాని, గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేపడుతూ అడ్డంగా దొరికిపోయారు నిర్మాణదారులు. అనుమతులు లేనిది నిర్మాణాలు చేపట్టకూడదని, పూర్తిస్థాయి అనుమతులు తీసుకున్న తర్వాతనే నిర్మాణం చేపట్టాలని హెచ్చరిస్తూ నిర్మాణాలను నిలిపివేశారు కాచవాని సింగారం గ్రామపంచాయతీ కార్యాలయ అధికారులు.

## పీర్జాదిగూడ పెద్ద చెరువుకు ఎఫ్‌టీఎల్ సరిహద్దు ఏర్పాటు



**మేడిపల్లి జనవరి 25 (తెలంగాణ చేతనం)** పీర్జాదిగూడ పెద్ద చెరువులో ఎటువంటి నిర్మాణాలు చేపట్టిన కఠిన చర్యలు తీసుకుంటామని, సహజ వనరులైన చెరువులు, కుంటలలో నిర్మాణాలకు అనుమతులు ఉండవని అన్నారు ఇరిగేషన్ ఏ ఈ పరమేష్. పీర్జాదిగూడ పెద్ద చెరువు పరిరక్షణలో భాగంగా ఎఫ్.టి.ఎల్ సరిహద్దులను మున్సిపల్ అధికారులతో కలిసి ఏర్పాటు చేసి చెరువుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని ఏఈ పరమేష్ కోరారు.

# నీరు లేక.. అంతంతే ఏరువాక



నల్గొండ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ రంగం ఈ ఏడాది ఒడిదొడుకుల మధ్య సాగింది. రాష్ట్రంలోనే ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే అత్యధికంగా వరి, పత్తి పంటలు సాగవుతున్నాయి. అయితే ఈ ఏడాది ఉమ్మడి జిల్లా సాగుకు ఆయువుపట్టు అయిన కృష్ణా పరివాహకంలో నీటి ప్రవాహం లేకపోవడం, రెండు రాష్ట్రాల వరప్రదాయిని అయిన నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో నల్గొండ, సూర్యాపేట జిల్లాలోని ఎడమ కాల్వ కింద ఉన్న సుమారు 3.5 లక్షల ఎకరాల ఆయకట్టు బీళ్లుగా మారనున్నాయి. మరోవైపు ఈ ఏడాది వేసవిలో దాదాపు వారం రోజుల పాటూ అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యం తడిసి ముద్దయింది. చాలా చోట్ల వరదకు వడ్లు కొట్టుకుపోయాయి. అనావృష్టి పరిస్థితులు, అకాల వర్షాలతో ప్రధాన పంటలయిన వరి, పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గాయి. గత ఆరేళ్లుగా వరుసగా 11 పంటలకు నాగార్జునసాగర్ నుంచి ఎడమ కాల్వ ఆయకట్టుతో పాటూ ఎస్ఎల్‌బీసీ ఆయకట్టు, చెరువుల కింద గరిష్ఠ స్థాయిలో వరి పంట సాగవగా..ఈ ఏడాది ఎగువ నుంచి వరద లేకపోవడం, స్థానికంగానూ లోటు వర్షపాతం నమోదవడంతో వరి, పత్తి సాగు వైపు రైతులు మొగ్గు చూపలేదు. గతేడాది వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11.3 లక్షల ఎకరాల్లో వరి పంట సాగవగా.. ఈ ఏడాది వానాకాలంలో అది 9.1 లక్షల ఎకరాలకు చేరింది. సుమారు 2.2 లక్షల ఎకరాల వరి సాగు తగ్గింది. ఈ ఏడాది వేసవిలో వరి కోతలు, కొనుగోళ్ల సమయంలో వారం రోజుల పాటూ అకాల వర్షాలు కురవగా.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.20 కోట్ల మేర ధాన్యం తడిసి పాడయిందని సంబంధిత అధికార వర్గాల ద్వారా తెలిసింది. మరో 10 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. పంటల బీమా పథకం లేకపోవడంతో రైతుకు ఒక్క రూపాయి బీమా దక్కని పరిస్థితి. మరోవైపు పత్తి సాగు సైతం గతేడాదితో పోలిస్తే తగ్గింది. సరైన సమయాల్లో వర్షాలు లేకపోవడం, చీడపీడల బెడదతో దిగుబడులు అమాంతంగా పడిపోయాయి. గతేడాది 10.5 లక్షల ఎకరాల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పత్తి పంటను రైతులు సాగు చేయగా... ఈ ఏడాది అది 8.5 లక్షల ఎకరాలకు తగ్గింది. దిగుబడి గతంలో ఎకరాకు హీనపక్షం 4 క్వింటాళ్ల రాగా..ఈ ఏడాది అది 2.5 క్వింటాళ్లకు పడిపోయింది. కొన్ని చోట్లా పెట్టుబడీ వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. గత యాసంగిలో ఎడమ కాల్వ పరిధి ఆయకట్టుతో పాటూ ఎస్ఎల్‌బీసీ, చెరువులు, కుంటలు, బోరు బావుల కింద 11 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. డిసెం బరు 20 వరకు అది కేవలం 48 వేల ఎకరాలకు పడిపోయింది. సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల లేదని, ప్రాజెక్టులో ఉన్న నీళ్లన్నీ తాగునీటి అవసరాలకేనని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసిన నేపథ్యంలో ఆయకట్టు భూములు ఈ యాసంగిలో ఏ పంట లేకుండా బీళ్లుగా ఉండనున్నాయి.

# వివాదాస్పదంగా వినాయక్‌చౌక్ నిర్మాణం




ఆదిలాబాద్ :పట్టణ సుందరీకరణలో భాగంగా స్థానిక వినాయక్‌చౌక్‌లోని క్లాక్‌టవర్ ని ర్మాణం రాజకీయ దుమారానికి కారణమవుతుంది. ఈ టవర్ కూల్చివేయాలంటూ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇటీవల మున్సిపల్ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే బీఆర్ఎస్ కౌన్సి లర్లు ఎమ్మెల్యే తీరును వ్యతిరేకిస్తుండటం రాజకీయ వేడి రాజేస్తోంది. ఈ క్రమంలో బల్దియా అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పట్టణ ప్రగతి నిధులు రూ.కోటి వ్యయంతో వినా యక్‌చౌక్ సుందరీకరణలో భాగంగా 40 అడుగుల ఎత్తులో క్లాక్ టవర్ నిర్మించారు. చుట్టూరా గోడలను అల్యూమినియం కాంపోజిట్ ప్యానల్ (ఏసీపీ క్లాడింగ్)తో చేపట్టారు. టవర్ గోడలకు వినాయకుడి ప్రతిమలతో పైభాగాన గ్లోబు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో ఏటా అట్టహాసంగా నిర్వహించే గణేశ్ నిమజ్జన శోభాయాత్రను ఈ చౌక్‌లోని శిశు మందిర్ నుంచే చేపట్టడంతో ఆరు రోడ్లతో కూడిన ఇక్కడి కూడలి వినాయక్ చౌక్‌గా ప్రసిద్ధి చెందింది. అయితే ఈ చౌక్‌లో వినాయకుడి విగ్రహాన్నే ఏర్పా టు చేయాలంటూ టవర్ నిర్మాణ సమయంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు ఆందోళనలు చేపట్టారు. అందుకు అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న స్పందిస్తూ వినాయకుడి విగ్రహంతో పాటు వినాయక్‌చౌక్‌గానే కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ టవర్ నిర్మాణంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం తో ప్రమాదాలు జరిగే ఆస్కారముందని, నిర్మాణం కూడా ప్రణాళికాబద్ధంగా చేపట్టలేదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇటీవల బల్దియా అధికారులతో నిర్వహించిన సమీక్షలో అభిప్రాయపడ్డారు. తక్షణమే కూల్చివేయాలని, నిబంధనలు అడ్డంకిగా ఉంటే ప్రభుత్వానికి రాయాలని మున్సి పల్ అధికారులను ఆదేశించారు. అయితే బల్దియా కౌన్సిల్ ఆమోదంతోనే చేపట్టిన టవర్‌ను కూల్చివేయడమేంటని, ఎమ్మెల్యే వ్యాఖ్యలను బీఆర్ఎస్ కౌన్సిలర్లు తప్పుపడుతున్నారు. రాజకీయాల కోసం టవర్ కూల్చివేత సరికాదంటున్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల భిన్నమైన వ్యాఖ్యలతో ఏం చేయాలో తెలియక బల్దియా అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

# యాసంగి సాగు ముమ్మరం



కరీంనగర్ : యాసంగి సీజన్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొందరు రైతులు వరి నారు పోస్తుండగా మరికొందరు పొలాలను దున్నుతున్నారు. అయితే, సాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్న ఉద్దేశంతో పలువురు అన్నదాతలు ముందస్తుగా నాట్లు వేయిస్తున్నారు. కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. వానాకా లంలో వరి పంట సాగు చేసిన రైతులు చెరువులు, బావుల్లో పుష్కలంగా నీరు ఉండటం, ఎస్సారెస్పీ నీటి విడుదల నేపథ్యంలో యాసంగిలో సైతం వరి సాగుకే ముందుకొస్తున్నారు. ఈ నెల 18న ఎస్సారెస్పీ నుంచి నీళ్లు విడుదల చేయగా కరీంనగర్ మండలానికి అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. వారబందీ విధానంలో 8 రోజులు నీటి సరఫరా, 7 రోజులు నిలిపివేత పద్ధతిలో నీరందించనున్నారు. ఈ నెలలో ఒక తడి, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో రెండేసి తడుల చొప్పున మొత్తం 7 నీటి తడులను విడుదల చేయనున్నారు. మండలంలో 13,009 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తుండగా వరిని 12,185 ఎకరాల్లో పండిస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అయితే, సాగునీటి సౌకర్యంతో ఈ విస్తీర్ణం మరింత పెరిగే అవకాశముంది. కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధి(కొత్తపల్లితో కలిపి)లోని డీ-89 నుంచి డీ-94 కాల్వల వరకు ఎస్సారెస్పీ ఆయకట్టు కింద మొత్తం 14,987 ఎకరాలు సాగవుతుంది. అత్యధికంగా నగునూరులో 2,950 ఎకరాలు, చామనపల్లిలో 1,789, బొమ్మకల్‌లో 1,289, మొగ్దుంపూర్‌లో 1,054, ఇరుకుల్లలో 1,086, చేగుర్తిలో 1,022, గోపాల్‌పూర్‌లో 993, ఎలబోతారంలో 935 ఎకరాల్లో పండించనున్నారు.

# వేరుశనగలో.. తిక్క ఆకు మచ్చ తెగులు



అలంపూర్: జిల్లాలో నీటి వనరులు, బోరు బావులు, కాల్వల కింద వేరుశనగ పంటలను సాగు చేశారు. జిల్లాలో ఈ సారి అత్యధికంగా వేరుశనగ పంటను రైతులు సాగు చేశారు. పంట ప్రస్తుతం పూత దశ నుంచి పిందె దశకు చేరుకుంటుంది. వేసిన వేరుశనగ పంటలకు అక్కడక్కడ తిక్క ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. తిక్క ఆకుమచ్చ తెగులుకు సకాలంలో నివారణ చర్యలు తీసుకోవాలని ఏడీఏ సక్రియనాయక్ సూచిస్తున్నారు. ఈ ఆకు పంటకు రెండు దశలో ఆశిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. పంట వేసిన నెల రోజుల్లో ఆశించే ఆకు మచ్చను లేత తిక్క తెగులు, పూత లేదా తర్వాత దశలో ఆశించే తెగులును ముదురు ఆకు మచ్చ తెగులుగా పేర్కొంటున్నారు. పూత దశలో ఆకు మచ్చ తెగులు ఆశిస్తే దిగుబడులు బాగా తగ్గే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. తెగులు లక్షణాలు, నివారణ గురించి రైతులకు ఈ విధంగా వివరిస్తున్నారు. లేత ఆకుమచ్చ తెగులు పంట వేసిన 30 రోజుల నుంచి కనిపిస్తుంది. ఈ మచ్చలు కొంచెం గుండ్రంగా ఉండి ఆకుల పైభాగాన ముదురు గోధుమ రంగు కలిగి ఉంటాయి. ముదురు ఆకు మచ్చ తెగులు అలస్యంగా పంట మీద కనిపించి మచ్చలు చిన్నవిగా గుండ్రంగా ఉండి ఆకు అడుగు భాగాన నల్లని రంగు కలిగి ఉంటాయి. మచ్చ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే ఆకులు పసు పు రంగుకు మారి నిర్జీవమైపోతాయి. మచ్చలు ఒకదానితో ఒకటి కలిసిపోతాయి. తర్వాత ఆకులు మొక్కలు పక్వానికి రాకముందే ఎండిపోయి రాలిపోతాయి. మచ్చ తెగులు ఆకు మీద కాకుండా కాండం మీద, ఆకు కాడలు, ఊడల మీద కూడా ఈ మచ్చలు ఏర్పడతాయి.తెగులు కనిపించిన వెంటనే మాంకోజెబ్ 400 గ్రాములు లేదా కార్బండిజమ్ 200 గ్రాములు లేదా క్లోరోథలోనిల్ 400 గ్రాములు లేదా హెక్సా కొనజోల్ 400 మి.లీ.ను 200 లీటర్ల నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

# మిరపలో బూడిద తెగులు



అలంపూర్: జిల్లాలో ఈ ఏడాది మిరప విస్తారంగా సాగైంది. అయితే ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల్లో బూడిద తెగులు, లద్దె పురుగు ఆశిస్తుందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియానాయక్ చెప్పారు. రైతులు సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో నష్టపోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. బూడిద తెగులు, లద్దె పురుగు నివారణకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే.. రాత్రివేళల్లో వాతావరణం చల్లగా ఉండటం, పగటి పూట ఎండ ఉండటం వలన బూడిద తెగులు వ్యాపిస్తుంది. ఈ తెగులు వలన ఆకుల మీద తెల్లని మచ్చలు ఏర్పడతాయి. తర్వాత ఈ మచ్చల నుంచి శిలీంద్ర బీజాలు ఉత్పత్తి అయి ఆకుల మీద తెల్లటి పొడగా ఏర్పడతాయి. తెగులు ఉధృతంగా ఉన్నప్పుడు తెల్లటి పొడలు ఆకుల మీద, పిందెల మీద, కాయల మీద వ్యాప్తి చెందుతాయి. ఆకులు ఎండి పండుబారుతాయి. ఆకుల మీద తెల్లటి పొడ ఏర్పడటం వలన కిరణజన్య సంయోగ ప్రక్రియ తగ్గిపోయి తగినంత ఆహార పదార్థాలు తయారు కాక కాయ నాణ్యత తగ్గిపోతుంది. ఈ తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 200 గ్రాములు, డైనోకాప్ 200 మి.లీ., బెలటాన్ 200 మి.లీ., ట్రైడిమార్ఫ్ 200 మి.లీ., అజాక్సి స్ట్రోబీన్ 200 మి.లీ.,లను 200 లీటర్లలో కలిపి ఆకులు బాగా తడిచేటట్లు పిచికారీ చేసుకోవాలి. ప్రస్తుతం కాయలకు కాయతొలిచే పురుగు ఆశిస్తుంది. ఈ పురుగు కాయలోపలి భాగానికి ప్రవేశించి లోపల ఉన్న పదార్థాన్ని తినడం వలన కాయ నాణ్యత పడిపోతుంది. ఈ పురుగు నివారణకు అసిఫేట్ 1.5 గ్రాములు, నువలురాన్ 1.0 మి.లీ., రెనాక్సిఫైర్ 0.3 మి.లీ., ఫ్లూబెండమయిడ్ 0.3 గ్రాములు, క్లోరాంత్రినిపోల్ 0.3 మి.లీ., ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

# దివ్యాంగ పిల్లలపై ప్రేమ చూపాలి




మిర్యాలగూడ : దివ్యాంగ పిల్లలపై తల్లిదండ్రులు ప్రేమ, ఆప్యాయతలను కలిగి ఉండాలని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. మిర్యాలగూడ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అందుతున్న అభ్యసన కార్యక్రమాలను పరిశీలించి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను ప్రేమతో ఆదరిస్తే వారు శారీరక, మానసిక పరివర్త చెందుతారని తెలిపారు. జిల్లాలో 34 భవితా కేంద్రాలు పనిచేస్తున్నాయని, 2279 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు అభ్యసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, 68 మంది ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్లు పనిచేస్తున్నారని వెల్లడించారు. ప్రతి కేంద్రంలో వారానికి ఒకసారి ఫిజియోథెరపి క్యాంపులు నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 19,700 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. ప్రతి మండలానికి నోడల్ అధికారిని నియమించామని.. విధులకు సరిగా హాజరుకాని ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీనాయక్, ఇన్‌క్లూజివ్ రిసోర్స్ టీచర్లు బ్రహ్మాచారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు




నల్లగొండ: నల్లగొండ జిల్లాలో రైస్ మిల్లులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు పోలీసు స్పెషల్ టాస్క్‌పోర్సు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. నల్లగొండ పట్టణంలోని రామలక్ష్మణ్ రైస్ మిల్లుతో పాటు హాలియాలో ఉన్న వజ్రతేజ రైస్ మిల్లులో కూడా దాడులు చేశారు. జిల్లాలో సీఎంఆర్ విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని, రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తున్నారని, వారిపై కఠినంగా వ్యవహరిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం నల్లగొండలో ప్రకటించారు. ఆయన ప్రకటించిన 24 గంటల్లోనే జిల్లాలోని రెండు మిల్లులపై అధికారులు దాడులు నిర్వహించడం గమనార్హం. ఉదయం నుంచి రెండు మిల్లులపై అధికారులు దాడులు నిర్వహించి ప్రభుత్వ పరంగా ధాన్యం కొనుగోలు చేసి ఆయా మిల్లులకు మూడు సీజన్లలో ఎన్ని మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చారు...ఆ ధాన్యానికి సంబందించి సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) కింద ఎంత బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాలనేది లెక్కలు చూస్తున్నారు. సీఎంఆర్ కింద ఇవ్వాల్సిన బియ్యం ఇప్పటి వరకు ఎంత ఇచ్చారు? ఇవ్వని బియ్యానికి సంబందించి ఆయా మిల్లుల్లో ధాన్యం ఉందా...అనే దానిపై అధికారులు గోదాముల్లో లెక్కలు తీస్తున్నారు. గత సంవత్సరం వానాకాలం, యాసంగి సీజన్లతో పాటు ప్రస్తుత సంవత్సరం వానాకాలం సీజన్‌కు సంబ?ందించి ఇచ్చిన ధాన్యానికి మిల్లర్లు తిరిగి ఇచ్చిన సీఎంఆర్‌కు పొంతన లేనట్లుగా తెలుస్తోంది. సీఎంఆర్ ప్రభుత్వం ఇచ్చిన గడువు మరో నాలుగు రోజుల్లో ముగియనుంది. ఓ మిల్లు ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యానికి సంబందించి 150 ఏసీకేల (290 క్వింటాళ్లకు ఒక ఏసీకే) వరకు బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. ఈ నాలుగు రోజుల్లో ఇవ్వడం సాధ్యం కాదు. అయితే ఆ ఇవ్వని బియ్యానికి సంబందించిన ధాన్యం కూడా ఆ మిల్లుల్లో పూర్తి స్థాయిలో లేనట్లుగా తెలుస్తోంది. మొత్తానికి అధికారులు గురువారం సాయంత్రంలోగా ఈ వివరాలు బయట పెట్టే అవకాశం ఉంది.

# బీఆర్ఎస్ దోపిడీ పత్రాలను విడుదల చేస్తాం:మంత్రి తుమ్మల




నల్లగొండ: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలు, దుబారా ఖర్చు, దోపిడీ పెద్ద ఎత్తున జరిగాయని, వాటన్నింటిపై దోపిడీ పత్రాలను విడుదల చేస్తామని రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. నల్లగొండలో జరిగిన ప్రజాపాలన సన్నాహక సమావేశం అనంతరం మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణను పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా చేసిందని, ప్రతి శాఖలోనూ అప్పులు పేరుకుపోయాయన్నారు. వాటన్నింటిపై తమ ప్రభుత్వం అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేస్తే.. వారు ఏదో చెమటోడ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్లుగా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు శ్వేద పత్రం విడుదల చేశారని విమర్శించారు. అందుకే వారు పదేళ్లలో తెలంగాణలో చేసిన దోపిడీపై పత్రాలను విడుదల చేస్తామన్నారు. దేశమే సిగ్గుపడేలా రూ.6 లక్షల కోట్లు అప్పులు చేసి తామేదో సాధించినట్లు చెప్పుకుంటున్నారని కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు. 1వ తేదీన కూడా ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితి బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిదన్నారు. రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసే రైస్ మాఫియాపై ఉక్కు పాదం మోపుతామని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తే తీవ్రమైన శిక్షలు ఉంటాయని చెప్పారు. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను కుర్చీలు వేసుకుని కట్టిస్తామని చెప్పిందని, కానీ ఏ ఒక్క ప్రాజెక్టు కూడా కట్టించలేదన్నారు. 28వ తేదీ నుంచి జరిగే ప్రజాపాలన కార్యక్రమంలో ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తులు తీసుకుంటామన్నారు. వంద రోజుల్లో ఆరు

# జుక్కల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తా:ఎమ్మెల్యే తోట



జుక్కల్: రానున్న ఐదు సంవత్సరాలల్లో రాష్ట్ర ప్రజలంతా జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించుకునేలా కృషి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సభలో పాల్గొని ప్రసంగించారు. జుక్కల్ ప్రజలు 15 ఏళ్ల నుంచి నిర్బంధంలో ఉన్నారని, ఇక్కడున్న ప్రతి పక్షం నేతలు అధికార పక్షం నాయకులతో కలిసి కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం చేశారని అన్నారు. జుక్కల్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ చూసుకుంటానని హామీ ఇచ్చారు. మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, మోహన్, బస్వరాజ్, తదితరులు పాల్గొన్నారు. కాటేపల్లి గ్రామ సర్పంచ్ బోధనం విఠల్ మండల కేంద్రంలోని పాపనేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2018లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి విఠల్ సర్పంచ్‌గా గెలిచారు.అనంతరం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇప్పుడు ఎమ్మెల్యే సమక్షంలో సొంత గూటికి చేరారు. ఆయనతో పాటు, సహకార సంఘం డైరెక్టర్లు గోకని గంగాగౌడ్, అబ్బనబోయిన పెంటయ్య, కాటేపల్లి, వడ్లం గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. జనవరి 6వ తేదీ వరకు నియోజకవర్గంలో నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని జుక్కల్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో అధికారులతో సమావేశం నిర్వహించారు.

# అభ్యర్థులు ఖర్చుల వివరాలు అందించాలి



సిరిసిల్ల :అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారు ఖర్చు చేసిన పూర్తి వివరాలను జనవరి 2లోగా అందించాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలన ప్రత్యేక అధికారిణి స్వప్న పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఖర్చుల వివరాలు ఎలా అందించాలనే దానిపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో చేసిన ఖర్చుల వివరాలను, బ్యాంక్ ఖాతా స్టేట్‌మెంట్ జత చేసి, ఒరిజినల్‌తో పాటు రెండు జతల జిరాక్స్ కాపీలు, రోజు వారి ఖర్చుల బుక్, క్యాష్ బుక్‌లను జనవరి 2లోగా అందించాలని సూచించారు. ఈ నెల 29న జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి, కలెక్టర్ అనురాగ్ జయంతి అభ్యర్థులతో సమావేశం నిర్వహించి అభ్యర్థుల ఖర్చుల వివరాలను పరిశీలిస్తారని చెప్పారు. ఎన్నికల నియమావళి ప్రకారం విధించిన ఖర్చులు, అభ్యర్థులు అందించిన ఖర్చుల వివరాలకు తేడా ఉంటే జిల్లా ఎన్నికల మానిటరింగ్ కమిటీని సంప్రదించి తేడా గురించి వారికి వివరించాలని పేర్కొన్నారు. 2న అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఎన్నికల సంఘం సీఈవో కార్యాలయానికి పంపించనున్నట్లు వెల్లడించారు. వివరాలు అందించని అభ్యర్థులను ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 10ఏ ప్రకారం అనర్హులు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. దీంతో పాటు వచ్చే మూడు సంవత్సరాల పాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హత కోల్పోతారన్నారు. జిల్లా నోడల్ అధికారి రామకృష్ణ, అసిస్టెంట్ వ్యయ పరిశీలకులు షేక్‌చాంద్, రాజేంద్రప్రసాద్, సుచేత, మహ్మద్ షఫీ, అంజయ్య, సవిత పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



కరీంనగర్ : ల్లా మహిళా, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టేడియంలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేతులమీదుగా దివ్యాంగులకు ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వందలాది రూ.కోట్లు ఖర్చు చేస్తుందని వివరించారు. ప్రస్తుతం రూ.68.24 లక్షల విలువైన 731 ఉపకరణాలు అందజేస్తున్నామని, మిగిలిన వారు తమ పేర్లు నమోదు చేసుకుంటే త్వరలో ఉపకరణాలు అందజేస్తామన్నారు. శిబిరానికి వచ్చిన దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా జిల్లా సంక్షేమ అధికారిణి సరస్వతి ఏర్పాట్లు చేయడంతో పాటు దగ్గరుండి పర్యవేక్షించారు. కొందరు పేర్లు నమోదు చేసుకున్నా ఉపకరణాలు రాలేదని, మరికొందరు తాము బ్యాటరీ ట్రైసైకిల్ అడిగితే మ్యానువల్ ట్రైసైకిల్ వచ్చిందని అధికారుల వద్ద వాపోయారు. పంపిణీ కార్యక్రమంలో అలింకో ప్రతినిధి రవిశంకర్, బల్దియా కమిషనర్ శ్రీనివాస్, దివ్యాంగుల సంఘం ప్రతినిధులు అంజనారెడ్డి, స్వామి, సంపత్, శ్రీనివాస్, లక్ష్మణ్, రాజిరెడ్డి పాల్గొన్నారు. మరోవైపు ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి వచ్చి ఉపకరణాలు పొందిన దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేశారు. నాకు ఇద్దరు బిడ్డలు. 2016లో జరిగిన రోడ్డు ప్రమాదంతో రెండు కాళ్లు పనిచేయకుండా పోయాయి. అప్పటి నుంచి తండ్రి, భార్య దగ్గరుండి నాకు సపర్యలు చేస్తున్నారు. ఇప్పుడు శిబిరంలో బ్యాటరీ ట్రైసైకిల్ అందించారు. చిన్నచిన్న పనులకు మరొకరి మీద ఆధారపడకుండా వెళ్లి రావచ్చు. చాలా ఆనందంగా ఉంది. కుటుంబ సభ్యులకు భారం కాకూడదని మొబైల్ దుకాణంలో పనిచేస్తున్నాను. ఇంతకాలం మ్యానువల్ ట్రై సైకిల్ ఉండేది. రోడ్డు ఎత్తుగా ఉన్నప్పుడు చేతితో తొక్కితే కదలక, ఇబ్బంది పడేవాడిని. బ్యాటరీ ట్రై సైకిల్‌కు దరఖాస్తు చేసుకుంటే మంజూరైంది. ఇకనుంచి గతంలో ఉన్న సమస్యలు ఉండవు. నా భర్త కూలీ పనికి వెళ్తాడు. నాకు ఒక కొడుకు. చచ్చుబడిపోయిన కాలుతో ఏదైనా పనిమీద బయటకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు మూడు చక్రాల సైకిల్ ఇవ్వడంతో ఆ ఇబ్బందులు తప్పుతాయి. కనీస అవసరాల కోసం నాకు నేనుగా సొంతంగా వెళ్లిరావొచ్చు.

# రైతువేదికల నిర్వహణకు నిధుల కొరత



పెద్దపల్లి : అటు నిర్వహణకు నిధుల కొరత.. ఇటు పర్యవేక్షణ లేకపోవడం.. వెరసి రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలు నిరుపయోగంగా మారాయి.. పంటల సాగులో అన్నదాతకు అండగా నిలవాలన్న ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది.. పంటల సాగులో ఆధునిక సాంకేతికతను రైతుల దరి చేర్చేందుకు, మార్కెటింగ్ తదితర అంశాలపై సదస్సులు నిర్వహించేందుకు 2020లో నాటి భారాస ప్రభుత్వం రైతు వేదికలు నిర్మించింది. క్లస్టరుకు ఒక్కోటి చొప్పున నిర్మించిన వేదికకు గరిష్ఠంగా రూ. 22 లక్షల వరకు వెచ్చించారు. ఉమ్మడి జిల్లాలో 258 రైతు వేదికల నిర్మాణానికి రూ. 56.6 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 258 రైతు వేదికలకు ఒక్కో దానికి ప్రతి నెలా రూ.10 వేల వరకు నిర్వహణ ఖర్చులవుతున్నాయి. 2022 జనవరి నుంచి నెలకు రూ.10 వేల చొప్పున చెల్లించారు. ఈ ఏడాది మార్చి నుంచి నిధులు నిలిచిపోవడంతో కొన్ని చోట్ల వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈవోలు) సైతం నిర్వహణను పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ. 25.8 కోట్ల మేర నిర్వహణ నిధులు రావాల్సి ఉంది. మండలకేంద్రాల్లో ఉన్న రైతు వేదికలు కొంతమేర సద్వినియోగమవుతున్నాయి. ప్రభుత్వ శాఖలకు చెందిన సమావేశాలు, ఇతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇక క్లస్టర్ల పరిధిలో ఉండే రైతు వేదికల తలుపులు ఏఈవోలు గ్రామానికి వస్తే మినహా తెరచుకోవడం లేదు.రాష్ట్రంలో గత భారాస ప్రభుత్వ హయాంలో రైతు సమన్వయ సమితులు ఏర్పాటయ్యాయి. గ్రామాల్లో రైతులను చైతన్యపరిచేందుకు ప్రతి పంచాయతీకి సమితి ఏర్పాటుతో పాటు మండల, జిల్లా కమిటీలను ఏర్పాటు చేశారు. వీటికి అధ్యక్షుడితో పాటు 15 మందితో కూడిన కార్యవర్గాన్ని నియమించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతుబంధు సమితులను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో రైతువేదికల నిర్వహణపై సందేహాలు తలెత్తుతున్నాయి. వీటిని రైతుల అవసరాలకు వినియోగిస్తారా? ఇతర ప్రభుత్వ అవసరాలకు వాడతారా? అనేదానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు.

# అర్ధరాత్రి ఇంధన కష్టాలు



జగిత్యాల :జిల్లాలో మొత్తం 106 పెట్రోల్ బంకులు ఉన్నా అర్ధరాత్రి వేళల్లో కనీసం ఒక్కటి కూడా అందుబాటులో ఉండటం లేదు. ఏళ్ల నుంచి ఇదే కొనసాగుతున్నా, పట్టించుకునేవారు కరవయ్యారు. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 24 గంటలు అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికీ రాత్రి 11 దాటిన తరువాత మూసివేస్తున్నారు. అత్యవసరమైన సందర్భాల్లోనూ ఇంధనం లభించడం లేదని వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణాలు, మండలాలతో పాటు, జిల్లా కేంద్రంలోనూ ఇదే దుస్థితి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి సైతం ఇంధన కష్టాలు తప్పడం లేదు. రాత్రి పూట 10 గంటల తరువాత భద్రత కారణాలతో బంకులు మూసి ఉంచుతున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారని వాహనదారులు చెబుతున్నారు. క్యూఆర్ కోడ్, యాప్‌ల ద్వారా క్యాష్‌లెస్ సేవలు అందించే అవకాశం ఉన్నప్పటికీ, ఇంధనం పోసేందుకు నిరాకరించడం వినియోగదారులకు సేవా లోపమేని ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రం, పట్టణాలు, మండలాల వారీగా, రాత్రి వేళల్లో కనీసం ఒక్క బంకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకుల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, వాహనాల టైర్లకు గాలి నింపే సౌకర్యం తదితరాలను కచ్చితంగా అందుబాటులో ఉంచాలి. నగదు అవసరం లేకుండా క్యూఆర్ కోడు ఆధారంగా క్యాష్‌లెస్ విషయంలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. అంతర్జాలం సక్రమంగా పనిచేయకపోవడం, తమ ఖాతా నుంచి నగదు బదిలీ అయినప్పటికీ, పెట్రోల్‌బంకు ఖాతాలోకి చేరలేదనే ఘటనలతో తరచూ ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనదారులకు ఇబ్బందులు ఎదురవకుండా బంకుల నిర్వాహకులు సేవలు అందించాల్సిందే. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదు.

## వృథాగా మిషన్ భగీరథ నీరు

కోరుట్ల.:కోట్ల రూపాయలు వెచ్చించి ఇంటిటికీ శుద్ధజలం(మంచినీరు) అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం లక్ష్యం నెరవేరడం లేదు. కోరుట్ల పట్టణంలో సుమారు లక్ష మంది ప్రజలు నివసిస్తున్నారు. ప్రజలకు మంచినీరు అందించేందుకు రెండేళ్ల కిందట అర్బన్ మిషన్ భగీరథ పథకంలో పట్టణంలోని అన్ని కాలనీల్లో నూతనంగా ప్రధాన పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. అంతర్గత పైప్‌లైన్ల ద్వారా ఇంటింటికీ ప్రత్యేక పైపులను అమర్చి కుళాయిలను బిగించి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ గుత్తేదారు గుత్తేదారు ఇంటింటికీ పైప్‌లైన్ ఏర్పాటు చేసి బిగించిన కుళాయిని తొలగించడంతో నీరు వృథాగా పోతోంది. పైపులను చాలాచోట్ల మురుగు కాలువలో, రోడ్లపై పడేస్తున్నారు. చాలాచోట్ల పైప్‌లైన్లకు పగుళ్లు వచ్చి లీకేజీలు ఏర్పడ్డాయి. పైపులను మురుగు కాలువలో వదిలేయడంతో మంచినీరు కలుషితమవుతోంది. పైపులకు అమర్చిన కుళాయిలను తొలగించడంతో రహదారులపై నిత్యం గంటల తరబడి నీరు ప్రవహించి బురదమయంగా మారడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తారురోడ్లపై నీరు ప్రవహించడంతో దెబ్బతినే ప్రమాదం నెలకొంది. ఇళ్ల ముందున్న పైపులకు కుళాయిలను అమర్చి భగీరథ నీరు వృథాగా పోకుండా అరికట్టాల్సిన బల్దియా అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

# అక్రమ లేఅవుట్లకు అడ్డుకట్ట పడేనా!



కోరుట్ల :నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా, అక్రమంగా వెలుస్తున్న లేఅవుట్లపై అధికారుల నిఘా కరవైంది. అన్ని ధ్రువపత్రాలు ఉండి ఇంటి అనుమతి కోసం అధికారుల చుట్టూ తిరిగినా అనుమతి ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తారు. పంచాయతీ పరిధిలో వెలుస్తున్న అనుమతి లేని లేఅవుట్లలో నిబంధనలకు విరుద్ధంగా ఇంటి అనుమతులు ఇవ్వడం అలసత్వానికి నిదర్శంగా నిలుస్తోంది. ఎలాంటి అనుమతులు లేని లేఅవుట్ స్థలంలో ఓ పంచాయతీ కార్యదర్శి ఏకంగా 50 ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం గమనార్హం. దీనిపై వివరణ ఇవ్వాలని కోరుతూ మండల అధికారి కార్యదర్శికి మెమో జారీ చేయడం ఉన్నతాధికారుల క్షేత్రస్థాయి పరిశీలనపై నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఎకరం స్థలంలో లేఅవుట్ ఏర్పాటు చేయాలంటే 40 అడుగుల రహదారి, 30 అడుగుల అంతర్గత రహదారి 10 శాతం పంచాయతీ పేరిట రిజర్వ్ స్థలం కేటాయించాల్సి ఉంటుంది. లేఅవుట్ రుసుం, మార్పిడి, కాలువలు, వీధి దీపాలు, అంతర్గత పైపులైన్లు, రహదారుల అభివృద్ధితో పాటు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అన్ని ఉంటేనే ఇంటి నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. లేఅవుట్లకు డీటీసీపీ అనుమతి ఉండి, అభివృద్ధి పనులు జరిగి బ్లూప్రింటు ఉంటే ఇంటి నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ కోరుట్ల మండలం కల్లూర్ గ్రామ శివారులోని లేఅవుట్లలో డీటీసీపీ అనుమతి లేకుండా ఏకంగా 50 ఇంటి నిర్మాణాలకు పంచాయతీ కార్యదర్శి అనుమతులు ఇచ్చారు. దీనిపై మండల అధికారి కార్యదర్శిని నిలదీశారు. దీనిపై పొంతన లేని సమాధానలు ఇవ్వడంతో మెమో జారీ చేశారు. కల్లూర్ గ్రామపంచాయతీ పరిధిలో డీటీసీపీ అనుమతులు లేకుండా లేఅవుట్ చేసి ఇళ్లు నిర్మిస్తున్నా ఉన్నతాధికారుల దృష్టికి తేకుండా, ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంపై పంచాయతీ కార్యదర్శి వివరణ కోరుతూ మెమో జారీ చేశాం. కార్యదర్శి వివరణ ఇవ్వకపోతే తగు చర్యలు తీసుకుంటాం. డీటీసీపీ అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపట్టడం మా దృష్టికి రాలేదు. కార్యదర్శి, ఎంపీవో సమక్షంలో పరిశీలన చేసి డీటీసీపీ అనుమతులు లేకుండా ఉంటే తగు చర్యలు తీసుకుంటాం. అనుమతులు ఉన్న వాటినే కొనుగోలు చేయాలి.

# సర్దుబాటు సరే.. జీతాలేవీ..?



కొత్తగూడెం: 'భూస్వామ్య వ్యవస్థకు చిహ్నాలుగా మిగిలిన వీఆర్ఏ ఉద్యోగాలను శాశ్వతంగా రద్దు చేస్తున్నాం.గ్రామ రెవెన్యూ అవసరాల కోసం నియమితులైన గ్రామ సహాయకులు వీఆర్ఏలుగా రూపాంతరం చెందారు. అలా తరతరాలుగా సామాజిక సేవ చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే' అంటూ భారాస సర్కారు వీఆర్ఏ వ్యవస్థను ఈ ఏడాది ఆగస్టు 10న రద్దు చేసింది. వారి విద్యార్హతల ఆధారంగా ఉత్తర్వులు 81, 85 ద్వారా ఇతర ప్రభుత్వ శాఖల్లో అటెండర్, రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ హోదాల్లో నియమించింది. ఇంతవరకు బాగున్నప్పటికీ నూతన ఉద్యోగాల్లో చేరింది మొదలు ఇప్పటివరకు వేతనాలు అందించకపోవడంతో వారంతా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యావసరాలు తీర్చుకోవటానికీ అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయని వాపోతున్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్న వారిని వివిధ శాఖల్లో విలీనం చేసిన ప్రభుత్వం ఆ తర్వాత వారికివ్వాల్సిన ఉద్యోగ గుర్తింపు సంఖ్య (ఐడీ), పీఆర్ఏఎన్ (పర్మనెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నంబర్) కేటాయించకపోవడంతో జీతాలు అందటం లేదు. సమస్య పరిష్కారానికి కలెక్టర్లకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని వారంతా వాపోతున్నారు. గతంలో మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా వేతనాలు చెల్లించే ప్రయత్నం జరగలేదని చెబుతున్నారు. ఆతర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో అటు మాతృశాఖ రెవెన్యూ, ఇటు కొత్త శాఖ నుంచి వేతనాలందక కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 354 (ఈ జిల్లాకు చెందిన వీఆర్ఏలు-228, సంగారెడ్డి, మహబూబాబాద్, రాజన్న సిరిసిల్ల, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి వివిధ శాఖల్లో విలీనమైనవారు-126) మంది ఉన్నారు. ఖమ్మం జిల్లాలో వీరి సంఖ్య సుమారు 650 మంది ఉంటుంది. ఐదు నెలలుగా వేతనాలు అందకపోవటంతో వీరిలో చాలామంది సెలవు దినాల్లో కూలీ పనులకు వెళ్తున్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ వేతనాల సమస్యను తీరుస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇదే విషయంపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ క్రమబద్ధీకరణ కోసం సుమారు 80 రోజుల పాటు సాగిన నిరవధిక సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వృద్ధాప్యంలో ఉన్నవారి వారసులకు ఉద్యోగాలు కల్పిస్తామని గత సర్కారు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదని, ఈ సమస్యనూ కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశిస్తున్నారు.

# 'మహాలక్ష్మి' పథకం దుర్వినియోగంపై నిఘా



ఖమ్మం:ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం అమలు కావడంతో టికెట్ల జారీలో లోపాలను అరికట్టేందుకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. బస్సుల రవాణా ప్రదేశాల్లో విస్తృత తనిఖీలు చేస్తూ పారదర్శక సేవలను అందించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. పథకం అమల్లోకి వచ్చాక ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు బస్సు ఎక్కే ప్రాంతం నుంచి గమ్యానికి చేరుకునే స్టాప్ వరకు కండక్టర్లు మహాలక్ష్మి జీరో టికెట్లు జారీ చేయాలి. ఎక్కువ మంది ప్రయాణికులను తరలిస్తే డ్రైవర్, కండక్టర్లకు సంస్థ నజరానాలు ప్రకటించింది. ఈ క్రమంలో ఎక్కువ టికెట్లు విక్రయిస్తున్నట్లు చూపించేందుకు కండక్టర్లు కొందరు పురుషులకు కూడా జీరో టికెట్లు ఇస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. మరోవైపు మహిళలకు అడిగిన స్టాప్ వరకు కాకుండా ఆపై స్టాప్‌ల టికెట్లు ఇస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆర్టీసీ తనిఖీ బృందాలు రంగంలోకి దిగాయి. తెలంగాణ గుర్తింపు కార్డు.. ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేసే వరకు తెలంగాణ ఆధార్ కార్డు, ఓటరు ఐడీల్లో ఒకటి ప్రయాణికులు వెంట తెచ్చుకోవడం తప్పనిసరని నిర్దేశించింది. ఇతర రాష్ట్రాలకు చెందిన కార్డులను అనుమతించడంలేదని స్పష్టం చేసింది. ఉచిత ప్రయాణం కావడంతో మహిళలు బృందాలుగా బయలుదేరి సాయంత్రానికి ఇంటికి చేరుకునేలా దగ్గర ప్రాంతాల్లో ఉన్న పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలకు సరదాగా వెళ్లి వస్తున్నారు. దీంతో బస్సుల్లో 70 శాతం మహిళలే ఉంటున్నారు. ఒక్కో వాహనంలో సీట్ల సామర్థ్యానికి మించి వంద మంది వరకు ప్రయాణికులు ఎక్కుతున్నారు. ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో 371 పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. వాటిలో గతంలో రోజుకు 90 వేల మంది ప్రయా ణించేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 1.20 లక్షలకు చేరింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్సులు అన్నీ ప్రయాణికులతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి.

## సీఎంఆర్ బకాయిల వసూలుకు

# రంగం సిద్ధం చేస్తున్న ప్రభుత్వం



హుజూర్‌నగర్ :ధాన్యంగానీ, బియ్యంగానీ లేదా నగదు ఇచ్చేందుకు వారికి అవకాశం కల్పిస్తాం. బకాయిదారుల నుంచి బకాయిల వసూలు విషయంలో ఇక ఉపేక్షించేది లేదు'.. అని ఇటీవల పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. బకాయిదారులే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణకు సిద్ధం అవుతోంది. ఇప్పటి వరకు సీఎంఆర్ ధాన్యం తీసుకొని సకాలంలో పెట్టకుండా ధాన్యాన్ని తమ వ్యాపారాభివృద్ధికి ఉపయోగించుకుని అధికారులను ముప్పతిప్పలు పెడుతున్న మిల్లర్లు ఇక బియ్యం లెవీ చెల్లించాల్సిందేనని ప్రభుత్వం అంటోంది. పౌరసరఫరాలశాఖ నష్టాలు, అప్పుల్లో ఉందని గుర్తించిన ప్రభుత్వం ఏ మేరకు సాధ్యమైతే అంతవరకు పూడ్చుకునేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా బకాయిల జాబితాను సిద్ధం చేసింది. వీటిని వెంటనే వసూలు చేయడం వల్ల కార్పొరేషన్ మనుగడకు ఇబ్బంది ఉండదని అధికారులు ప్రభుత్వానికి సూచించినట్లు తెలిసింది. దీంతో జిల్లాల వారీగా బకాయిలు ఉన్న మిల్లర్ల జాబితా సిద్ధం చేస్తున్నారు. సీఎంఆర్ ధాన్యం తీసుకున్న మిల్లర్లు ధాన్యం, బియ్యం, నగదు మూడింటిలో ఏది ఇచ్చినా తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇంకా మొరాయిస్తే ప్రభుత్వం కఠిన చర్యలకు దిగుతుందని హెచ్చరిస్తున్నారు. గతంలో ప్రభుత్వం అనేక వాయిదాలు ఇచ్చినా మిల్లర్లు తిరిగి ఇవ్వకపోవడంతో వారిపై చర్యలకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 2022-23 వానాకాలం సీజన్‌కు సంబంధించి దాదాపు 7,01,374 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యంగా ఉండగా.. ఇప్పటి వరకు 6,00,147 మెట్రిక్ టన్నులు వసూలైంది. ఇంకా 1,01,227 మెట్రిక్ టన్నుల బియ్యం లెవీ పెట్టాల్సి ఉంది. యాసంగి కూడా అయిపోయింది కానీ వానాకాలం సీజన్ బియ్యం లక్ష్యం మాత్రం పూర్తి కాలేదు. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా సూర్యాపేట జిల్లా పెట్టాల్సి ఉండగా ద్వితీయస్థానంలో యాదాద్రి భువనగిరి, నల్గొండ మూడో స్థానంలో ఉన్నాయి.

### పోరాటాన్ని ఉద్ధృతం చేసిన
# అంగన్వాడీలు.. ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి..

అమరావతి : ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ఆంధ్రప్రదేశ్‌లో అంగన్వాడీలు పోరాటాన్ని ఉద్ధృతం చేశారు. ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి కార్యక్రమంతో ఆందోళనలను హోరెత్తించారు. ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటు ఇతర అంగన్వాడీ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించే వరకూ సమ్మెను విరమించబోమని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి దీప్తి మనోజ స్పష్టం చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గిరిధర్‌రావు కార్యాలయం ఎదుట బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా దీప్తి మాట్లాడుతూ ప్రభుత్వం చర్చల పేరుతో అంగన్వాడీల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఆర్థికేతర సమస్యలను పరిష్కరించామని.. సమ్మె విరమంచాలని మంత్రులు చెప్పడం సరికాదన్నారు. ఆర్థిక పరమైన విషయాలను పరిష్కరిస్తేనే తాము సమ్మె విరమిస్తామని.. అప్పటి వరకూ సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్థానికంగా ఎమ్మెల్యే అందుబాటులో లేరని కార్యాలయ సిబ్బంది తెలిపినా.. ఆయన వచ్చేంత వరకూ వేచి ఉంటామని అంగన్వాడీలు అక్కడే బైఠాయించారు. ఈ నిరసనల్లో సీఐయూటీ



నగర కార్యదర్శి శ్రీనివాసరావు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఇంటిని అంగన్వాడీ కార్యకర్తలు ముట్టడించారు. ఎమ్మెల్యే ఇంటి ముందు బైఠాయించి నినాదాలు చేశారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఇంటి ముట్టడికి యత్నించిన అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు, అంగన్వాడీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

# కష్టాల చదువులు ఇంకెన్నాళ్లు?




తాడిపత్రి. తాడిపత్రి పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కనీస వసతులు కరవయ్యాయి. తీవ్ర అసౌకర్యాల నడుమ విద్యార్థులు చదువును కొనసాగించాల్సిన దుస్థితి. 2009లో తాడిపత్రికి ప్రభుత్వ ఐటీఐ కళాశాల మంజూరైంది. అప్పటి నుంచి స్థానిక మార్కెట్‌యార్డులోని రేకులషెడ్లలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ సివిల్, డీజిల్ మెకానిక్, కంప్యూటర్, ఎలక్ట్రికల్ వంటి బ్రాంచులు ఉన్నాయి. మొత్తం 160 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కర్నూలు, కడప జిల్లాల సరిహద్దులో తాడిపత్రి ఉండటంతో అక్కడి విద్యార్థులు సైతం కళాశాలలో చేరి చదువుకుంటున్నారు. కళాశాలకు సొంత భవనాలు లేవు. ఆ దిశగా పాలకులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. రేకులషెడ్లలో తరగతులు నిర్వహిస్తుండటంతో వర్షాకాలంలో నీరు లోపలికి చేరుతున్నాయి. వేసవిలో ఎండ వేడిమికి గదుల్లో కూర్చోలేక పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా విభాగాలకు పరికరాలు ఉన్నాయి. వాటికి విద్యుత్తు కనెక్షన్ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కంప్యూటర్లు సైతం పని చేయడం లేదు. గదుల పక్కనే పండ్లు, పలు రకాల కూరగాయల దుకాణాలు ఉండటంతో దుమ్ము ధూళి వస్తుంది. ఫిట్టర్ విభాగానికి చెందిన విద్యార్థులను శిథిల గదిలో కూర్చోబెడుతుండటంతో అది ఎప్పుడు కూలుతుందోనని భయాందోళన చెందుతున్నారు. మరుగుదొడ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. తాగునీరు, గాలి, వెలుతురు సరిగా లేవు. తరగతి గదుల సమీపంలో పండ్లు, ధాన్యం వ్యర్థాలు పడేస్తుండటంతో అవి కుళ్లి దుర్వాసన వస్తున్నాయి. దానికితోడు దోమల విపరీతంగా ఉన్నాయి. ఇక్కడ వసతులు లేకపోవడంతో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపడం లేదు.

# దెబ్బతిన్న పంటల వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తాం

యడ్లపాడు : తుపాను ప్రభావంతో నీట మునిగి పంటలు దెబ్బతిని నష్టపోయిన బాధిత రైతులను ఆదుకోవటానికి చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి మురళీ తెలిపారు. వ్యవసాయ అధికారులతో కలసి ఆయన యడ్లపాడు మండలంలో పర్యటించారు. తుపాను ప్రభావంతో నక్కవాగు పొంగి వరద నీటిలో మునిగిన జాలాదిలోని పంటచేలను పరిశీలించారు. వరద నీటిలో నానుతున్న శనగ, పొగాకు, మొక్కజొన్న, జూట్ పంటలకు వాటిల్లిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో చూశారు. బాధిత రైతులతో మాట్లాడారు. పంటచేలలో నీటిని ముందుగా బయటకు పంపే ఏర్పాటు చేయాలన్నారు. పొలాలు ఆరాక చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. దెబ్బతిన్న పంటల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. నక్కవాగు వరద నీటితో గ్రామంలోని పంటచేలు మొత్తం మునిగిపోయాయని, మూడు రోజులు గడచినా వరద నీరు ఇంకా బయటకు పోలేదని, పంటలు పూర్తిగా నాశనమయ్యాయని రైతులు అధికారులకు మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకురాలు మస్తానమ్మ, ఏవో సరిత, సిబ్బంది పాల్గొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పురపాలక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు



ప్రేమ్‌కుమార్, విజయసారధి పురపాలక సంఘ కమిషనర్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలు, పీఎఫ్ ఖాతాలు, బదిలీలు, పదోన్నతులు కల్పించాలని, పురపాలక పరిధిలో డీవైఈవో, అర్బన్ ఎంఈవో కేటాయించాలని కోరారు. అలాగే మున్సిపల్ ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. మెడికల్ బిల్లులు డీడీవో ద్వారా పంపే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహ అధ్యక్షులు మోహన్‌రావు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, పట్టణశాఖ అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# నష్టం అంచనాల్లో అధికారులు
## బాధితులకు సమకూరని నిత్యావసరాలు

పుత్తూరు : మిగ్‌జాం తుపాను ధాటికి కురిసిన భారీ వర్షాలు తూర్పు మండలాలను అతలాకుతలం చేశాయి. మూడ్రోజుల వర్షాలతో రైతులు పంటలు మునిగి కుదేలవగా.. ఇళ్లు కూలిపోయి.. ప్రభుత్వం నుంచి కాసింత చేయూత లభించక ప్రజలు బెంబేలెత్తిపోయారు.. అసలు తమ కు నిత్యావసరాలైనా పూర్తిగా అందుతాయో? లేదో అనే సంశయంలో ఉన్నారు.. తాజాగా వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రంగంలోకి దిగి నష్ట అంచనాలు, అన్నదాతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెబుతున్నారు.. అయితే నష్ట పరిహార నివేదిక పూర్తయ్యేది ఎప్పటికి? పరిహారం అందేది ఇంకెన్నటికోనని 'తూర్పు' ప్రజలు వేకళ్ల ఎదురుచూస్తున్నారు. నగరి నియోజకవర్గం సహా పలు మండలాల్లో భారీ వర్షాల దెబ్బకు పంటలు నీట మునిగాయి. కొన్ని ఇళ్లు నేలకూలగా మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. మరికొన్నిచోట్ల నీరు ఏకంగా నివాసాల్లోకి వచ్చేసింది. గతంలో తుపాను వల్ల నష్టపోయిన బాధితులకు తక్షణ సాయం కింద నిత్యావసర వస్తువులు, కొంత నగదు అందజేసే వారు. ప్రస్తుతం అలాంటి సాయమేదీ ఇప్పటికి బాధితులకు అందనేలేదు సరికదా.. వారిని పరామర్శించి కాసింత ధైర్యం చెప్పేవారే కరవయ్యారు. తుపాను తీరం దాటి మూడ్రోజులు గడిచినా ఇళ్లు కూలిన బాధితులను పట్టించుకున్న నాథుడు లేడు. వర్షాల వల్ల ఇళ్లు కోల్పోయిన బాధితుల వివరాలు మాత్రం ఆయా పంచాయతీల వీఆర్వోలు లెక్క తేల్చి తహసీల్దార్లకు అందజేశారు. పుత్తూరు మండలంలో మొత్తం 198 ఇళ్లు దెబ్బతిన్నాయని, 197 ఇళ్లలో నీరు చేరిందని, ఒక్క ఇల్లు పాక్షికంగా కూలిందని నిర్ధరించారు. నగరి మండలంలో 87 ఇళ్లు, వరి, వేరుసెనగ, ఉద్దులు కలిసి 116 ఎకరాలు పంటలు దెబ్బతిన్నట్లు లెక్కతేల్చారు. వడమాలపేట మండలంలో 82 ఇళ్లు, నింద్రలో 184 ఇళ్లలో నీరు చేరిందని, 54 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. పంటలు 120 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ఆ శాఖ అధికారులు నివేదిక



సమర్పించడం గమనార్హం. లెక్కలు తేల్చడం బాగుగన్నా.. బాధితులకు వెంటనే అందాల్సిన బియ్యం, పప్పు, నూనె తదితర సరకులు, నగదు నేటికీ ఇవ్వకపోవడమే కొసమెరుపు. చిత్తూరు, తిరుపతి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు. అయితే ఒక్క మంత్రీ ఇప్పటివరకు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన దాఖలాల్లేవు. కనీసం బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పాలన్న ధ్యాసా లేకపోవడం గమనార్హం.

ఒక్క నగరిలో మంత్రి రోజాకు చెందిన ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఆమె సోదరుడు, మున్సిపల్ ఛైర్మన్, తెదేపా బాధ్యుడు గాలి భానుప్రకాష్ నిత్యావసర సరకులు అందజేయడం గమనార్హం.

ప్రభుత్వ లెక్కల ప్రకారం వరి కోత దశలో నష్టపోతేనే పరిహారం అందుతుంది. వేరుసెనగ విత్తి కాయల దశలో ఉన్న సమయంలో నష్టపోతేనే పరిహారం వస్తుంది. ఈ నేపథ్యంలో అధికారులు ప్రభుత్వానికి నివేదించినా వరి, వేరుసెనగ పంట నష్టపోయిన రైతులకు పరిహారం దక్కే అవకాశం లేదు. ఇక అక్కడక్కడ ఉద్యాన పంటలైన పూలు, మిరప, కూరగాయలు, ఆకు కూరల పంటలు దెబ్బతిన్నాయి. వాటికైనా పరిహారం వస్తుందా అనేది సంశయంగా మారింది.

# సన్నద్ధత లేదు..సంచులూ ఇవ్వలేదు

రాజమహేంద్రవరం: ఉమ్మడి జిల్లాలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. మిగ్‌జాం తుపాను మిగిల్చిన నష్టం అంతా ఇంతాకాదు. భారీ వర్షాలకు పది నుంచి వారం రోజుల ముందుగానే కోతలు పూర్తి చేసిన రైతులు నిండా మునిగిపోయారు. ఒబ్బిడి చేసిన పంటను తీసుకెళ్లండంటూ రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకే)లకు వెళ్తే సంచులు ఇవ్వలేదు. తేమ పేరిట కొర్రీలు పెట్టడం.. మళ్లీ ఆరబెట్టాలని సలహాలిస్తూ వాహనాలు సమకూర్చకపోవడంతో ఇప్పుడు వేలాదిమంది తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. తుపానుకు మూడు రోజుల ముందు నుంచే రైతుల వద్ద ధాన్యం కొనుగోలుకు యంత్రాంగం చర్యలు తీసుకుని ఉంటే ఈ సమస్య నెలకొనేది కాదని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు. రైతులకు ఇచ్చే సంచులు (40 కిలోలవి) పూర్తిగా చినిగిపోవడానికి తోడు ఏ మూలకూ సరిపోని పరిస్థితి ఎదురవుతోంది.తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు కోసిన ధాన్యాన్ని హుటాహుటిన సమీపంలోని మిల్లులకు తరలించండి. తేమ, ఇతర నిబంధనలు పక్కన పెట్టి యుద్ధప్రాతిపదికన వాహనాలు సమకూర్చి రైతులకు నష్టం వాటిల్లకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. నేను క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లి అడిగినప్పుడు సహాయక చర్యలు బాగా చేశారని బాధితులు చెప్పాలి. పొలం కౌలుకు తీసుకుని భార్య పుస్తెలు కుదువపెట్టి కొందరు.. అధిక వడ్డీలకు అప్పులు చేసి మరికొందరు ఆశగా సాగు చేశారు. చివరికి కన్నీరే మిగిలింది. మిల్లులకు ఆర్బీకేల ద్వారా తరలించినా ఒక శాతం తేమకు కిలో చొప్పున ధాన్యం తరుగు వేస్తున్నారని, కొందరు వ్యాపారులైతే బస్తాకు రూ. 1200 మాత్రమే ఇస్తామని చెబుతున్నారన్నారు. ముమ్మిడివరం మండలం కొత్తలంకకు చెందిన ఓ రైతు మాట్లాడుతూ "15 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి వేశా.. అయిదెకరాలు కోసి గట్టుమీద వేసి



వాహనం, జట్టుకూలీ డబ్బులు నేనే చెల్లిస్తానని. ధాన్యం తీసుకోమని రైతు భరోసా కేంద్రానికి వెళ్లా. డిసినందున తీసుకోలేమని, అటువంటి ఆదేశాలు తమకు రాలేదని చెప్పారు. మిల్లుకు తరలించినా బస్తాకు రూ. 1000 ఇస్తారో.. రూ. 500 ఇస్తారో చెప్పలేమనే సమాధానం వచ్చింది" అంటూ వెల్లడించారు కొత్తపేట మండలం అవిడిలోని జగనన్న లేఔట్‌లో 50 ఎకరాల దిగుబడులు రాశులుగా వేస్తే నీరు చేరిపోయింది. కోసిన వెంటనే స్థానిక ఆర్బీకే సిబ్బందికి చెబితే.. తేమ పేరిట కొర్రీలు పెట్టడంతో ఈ నష్టం వాటిల్లింది.

ధాన్యం విక్రయించేందుకు రైతు భరోసా కేంద్రానికి వెళ్తే సంచులు ఇవ్వడంలేదు. ట్రాక్టరు సమకూర్చడం లేదు. ఏదోలా ఈ రెండింటిని సమకూర్చి మిల్లుకు వెళ్తుంటే తేమ ఉందని 75 కిలోల బస్తాకు రెండు నుంచి మూడు కిలోలు ధాన్యం అధికంగా తీసుకుంటున్నారు. సకాలంలో ధాన్యం దించక మొలకలొచ్చేస్తున్నాయి.

# ఓటు బటన్ నొక్కుతాం.. సత్తాచాటుతాం!



రాజమహేంద్రవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన ఉద్ధృతం చేశారు. చర్చల పేరుతో సంఘ ప్రతినిధులను పిలుస్తున్న ప్రభుత్వం బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. అమలాపురం, రామచంద్రపురం, కొవ్వూరు, తునిలో మంత్రుల ఇళ్లు, క్యాంపు కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయం నుంచి మంత్రి వేణుగోపాలకృష్ణ నివాసం వరకు సుమారు 400 మంది ర్యాలీగా వెళ్లి ముట్టడి చేపట్టారు. కంచాలపై గరిటెతో కొడుతూ.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.. బయటకు వచ్చిన మంత్రికి వినతిపత్రం అందజేశారు. - అమలాపురం ఐసీడీఎస్ కార్యాలయం నుంచి భట్నవిల్లిలోని మంత్రి విశ్వరూప్ నివాసానికి ప్రదర్శనగా వెళ్లి ముట్టడించారు. పోలీసులు అడ్డుకోవడంతో ఇరుపక్షాల మధ్య వాగ్వాదం రిపోలీసు వలయం ఛేదించిగింది. మంత్రి అందుబాటులో లేరని పోలీసులు చెప్పగా.. ఖాళీ కుర్చీకైనా వినతిపత్రం అందజేస్తామని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. పోలీసు వలయం ఛేదించి మంత్రి ఇంటి ఎదుట బైఠాయించారు. అక్కడి సిబ్బందికి వినతి ఇచ్చారు. ఎన్నికల్లో బటన్ నొక్కి తమ సత్తా ఏమిటో సీఎంకు చూపుతామన్నారు. - తుని తహసీల్దార్ కార్యాలయం నుంచి మంత్రి దాడిశెట్టి రాజా ఇంటికి ర్యాలీగా వెళ్తున్న అంగన్‌వాడీ సిబ్బందిని పోలీసులు అడ్డుకున్నారు. తాము వెళ్లి తీరుతామని వారంతా భీష్మించారు. కొందరికే అనుమతి ఇవ్వడంతో మంత్రి నివాసం ఎదుట నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. - కొవ్వూరులో ఆర్డీవో కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ మీదుగా మంత్రి తానేటి వనిత క్యాంపు కార్యాలయానికి సిబ్బంది వెళ్తుండగా పోలీసులు నియంత్రించారు. దీంతో రోడ్డుపైనే బైటాయించి నినాదాలు చేశారు.


# ఓటు వేసి మోసపోయాం- డీఎస్సీ అభ్యర్థుల నిరసన గళం

తిరుపతి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏటా మెగా డీఎస్సీ నిర్వహిస్తానని అభ్యర్థులకు ఆశపెట్టి ఓట్లు వేయించుకున్నాడని.. నాలుగున్నర సంవత్సరాలుగా డీఎస్సీ నిర్వహించకుండా అభ్యర్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు విమర్శించారు.డీఎస్సీ అభ్యర్థులు స్థానిక ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి ఆర్డీవో కార్యాలయం కూడలి చేరుకున్నారు. అక్కడ మానవహారం నిర్వహించి బైఠాయించారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఖాళీగాఉన్న 25 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని పాదయాత్ర సమయంలో సీఎం హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటివరకు ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకపోవడం దారుణమన్నారు. విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిన ఘనత వైకాపా ప్రభుత్వానికే దక్కిందని మండిపడ్డారు. ఆడుదాం... ఆంధ్ర క్రీడల పేరుతో యువతను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారన్నారు. తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ నాయకులు సంఘీభావం




ప్రకటించారు. నాయకులు రవినాయుడు, సిద్ధిక్, హేమంత్ రాయల్, కృష్ణయాదవ్, సందీప్, నరేంద్ర, తోటవాసు, వెంకటేష్ యాదవ్, ప్రసన్న, రవినాయక్, రంజిత్, శ్రీరామ్, రఫీ, గోపి పాల్గొన్నారు.

# పగలు తోడేస్తూ... రాత్రి తరలిస్తూ..



కదిరి : ప్రభుత్వం గుర్తించిన ప్రదేశాల్లో తప్ప మిగతాచోట్ల ఇసుక తరలింపును జగన్ సర్కార్ నిషేధించింది. వీటిని అడ్డుకునేందుకు ప్రత్యేకంగా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరోను ఏర్పాటు చేసింది. ఇదంతా ఒకవైపే. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా అన్నచందంగా అధికార పార్టీ నాయకుల అండతో వాగును తోడేస్తూ ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు కొందరు ఇసుకాసురులు. కదిరి మండలం కొండమనాయు నిపాల్లెం వాగు నుంచి నిత్యం పదులసంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. సెబ్ అధికారులు, పోలీసులు, నీటిపారుదలశాఖ అధికారులు అడపాదడపా అక్రమార్కులపై కేసులు పెడుతున్నా.. పూర్తిగా ఆపలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పదులసంఖ్యలో కూలీలను పెట్టుకుని పట్టపగలే వాగునుంచి ఇసుకను తోడేస్తూ పక్కన నిల్వ ఉంచుతున్నారు. రాత్రివేళల్లో ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తూ కాసులు పిండుకుంటున్నారు. సామాన్యుడు ఇల్లు కట్టుకుందామంటే ఇసుక అందని ద్రాక్షగా మారింది. అదే అధికార పార్టీ నాయకులకు చాలినంత ఇసుక దొరుకుతోంది. యథేచ్ఛగా తోడుకుని అధిక ధరలకు విక్రయిస్తున్నా.. అడ్డుకునే నాథులే కనిపించడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. వాగు రూపు కోల్పోయేలా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని నీటిపారుదలశాఖ ఏఈ మహేశ్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న వారిపై సెబ్ అధికారులతో పాటు కదిరి గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వివరించారు.

# చేబ్రోలులో ఇళ్లు, దుకాణాల కూల్చివేత

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామ శివారు 216 జాతీయ రహదారి పక్కన సర్వే నంబరు 94లో ఉన్న 8 దుకాణాలు, రెండు ఇళ్లను వేకువజామున గుర్తుతెలియని వ్యక్తులు జేసీబీతో కూల్చివేశారు. ఘటనా ప్రాంతాన్ని తహసీల్దారు వెంకటేశ్వరరావు, పిఠాపురం సిఐ శ్రీనివాసు, ఎస్సై వినయ్‌ప్రతాప్, జడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల నాగలోవరాజు పరిశీలించారు. ఇళ్లలో ఉన్న తమను భయభ్రాంతులకు గురిచేసి దుర్భాషలాడుతూ ధ్వంసానికి పాల్పడ్డారని బాధితులు వాపోయారు. బద్దా నూకరాజు నుంచి డి పట్టా నిర్మించుకుని జీవిస్తున్నామని ఉలవకాయల సాంబమూర్తి తెలిపారు. చేబ్రోలు శివారు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాల పక్కన ఉన్న సర్వే నంబరు 94లో 56 సెంట్ల ప్రభుత్వ



# రన్‌వే అనుకుని.. నదిపై ల్యాండ్ అయిన విమానం



శీతాకాలం రావడంతో రష్యా గజగజలాడుతోంది. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోవడంతో దేశవ్యాప్తంగా అత్యధిక ప్రాంతాల్లో విపరీతమైన మంచు కురుస్తోంది. యకుటియా ప్రాంతంలోని జిర్యాంక సమీపంలో కొలిమా నది పూర్తిగా గడ్డకట్టుకుపోయింది. అయితే, ఈ నదిని ఆనుకునే ఓ విమానాశ్రయం ఉంటుంది. దీంతో ఇక్కడ దిగాల్సిన ఓ విమానం పొరబాటుగా గట్టకట్టిన నది పై ల్యాండ్ అయ్యింది. పోలార్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన సోవియెట్ కాలం నాటి ఆంటోనోవ్-24 విమానం గురువారం జిర్యాంక ఎయిర్‌పోర్టులో దిగాల్సి ఉంది. అయితే ఈ విమానాశ్రయంలోని రన్‌వే పై మంచు పేరుకుపోయింది. పక్కనే నది కూడా గడ్డకట్టి ఉండటంతో పైలట్ గందరగోళానికి గురయ్యాడు.

ఫలితంగా విమానం నదిపై ల్యాండ్ అయ్యింది. ఆ సమయంలో విమానంలో 30 మంది ప్రయాణికులున్నారు. విషయం తెలుసుకున్న ఎమర్జెన్సీ అధికారులు వెంటనే అక్కడకు చేరుకుని ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగలేదు. పైలట్ తప్పిదం కారణంగానే విమానం నదిపై ల్యాండ్ అయ్యిందని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. దీనిపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. గడ్డకట్టిన నదిపై విమానం ల్యాండ్ అవడం, అందులోని ప్రయాణికులను బయటకు తరలిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఘటనపై పోలార్ ఎయిర్‌లైన్స్ స్పందించింది. "జిర్యాంక ఎయిర్‌పోర్టు రన్‌వేకు వెలుపల ఏన్-24 విమానం దిగింది" అంటూ ఓ ప్రకటన విడుదల చేసింది.

## 2024లో మరింత

# వేగంగా భారత్ వృద్ధి - అసోచామ్



ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో అగ్రగామిగా ఉన్న భారత్ 2024లో కూడా అత్యంత వేగంగా అభివృద్ధి చెందనున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని అసోచామ్ ఈ రోజు (గురువారం) ఒక ప్రకటనలో తెలిపింది. రైల్వేలు, విమానయానం, అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీతో సహా నిర్మాణం, ఆతిథ్యం, మౌలిక సదుపాయాలు వంటి రంగాలలో పెట్టుబడులు పెరగడానికి దారితీసే బలమైన వినియోగదారుల డిమాండ్ నేపథ్యంలో 2024లో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని అసోచామ్ వెల్లడించింది. 2023 జులై - సెప్టెంబర్ త్రైమాసికంలో ప్రభుత్వ వ్యయం మాత్రమే కాకుండా తయారీ పరంగా బూస్టర్ షాట్‌లతో ఊహించిన దానికంటే వేగంగా 7.6 శాతం వృద్ధి చెందడంతో భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా గుర్తింపు పొందింది. దీంతో ఆర్థిక వ్యవస్థ మరింత పెరుగుతుందని, మెరుగైన అవకాశాలు లభిస్తాయని అసోచామ్ సెక్రటరీ జనరల్ 'దీపక్ సూద్' అన్నారు. భారతదేశ - వృద్ధి జూలై-సెప్టెంబర్‌లో చైనా కంటే ఎక్కువైనట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది ఆర్థిక, నిర్మాణ, హెూటళ్లు, ఏవియేషన్, ఆటో, ఎలక్ట్రానిక్స్ వంటి తయారీ రంగాల ఆధ్వర్యంలో దేశీయ కంపెనీల పనితీరు మరింత మెరుగుపడనుందని అసోచామ్ సెక్రటరీ అభిప్రాయపడ్డారు.

## అమ్మకాల్లో తగ్గేదేలే అంటున్న

# ఆ మూడు కార్లు.. వాటి ప్రత్యేకతలు,





మీరు త్వరలో ఒక ఎస్‌యూవీ కొనుగోలు చేయాలనుకుంటున్నారా.. మీ బడ్జెట్ రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఉందా.. అయితే మీరు క్రెటా కారు కొనాలని భావిస్తున్నారు. మీ బడ్జెట్‌లో వస్తున్న మిడ్ సైజ్ ఎస్‌యూవీ క్రెటా.. ఎక్కువ మంది దీని కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఇదే బడ్జెట్‌లో మంచి ఫీచర్లతో మరికొన్ని ఎస్‌యూవీలు మార్కెట్‌లోకి వచ్చాయి. ఈ కార్లలో ఫైవ్ స్టార్ సేఫ్టీ రేటింగ్‌తోపాటు శక్తివంతమైన ఇంజిన్ ఉన్నాయి. మీ బడ్జెట్‌లో కొనుగోలు చేయాల్సిన, ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్న కార్ల గురించి తెలుసుకుందాం. దీని ధర రూ. 10.89 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు ఉంది. స్కోడా కుషాక్ 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో అందుబాటులో ఉన్నాయి. దీని 1.0 ఎల్ టర్బో పెట్రోల్ ఇంజన్ 6-స్పీడ్ ఎంటీ, 6-స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ వర్షన్‌లో అందుబాటులోఉంది. స్కోడా కుషాక్‌కు 5 స్టార్ సేఫ్టీ రేటింగ్‌తో కంపెనీ ఎస్‌యూవీ ఇంధన ట్యాంక్ 50 లీటర్ల సామర్థ్యం, బూస్ట్ స్పేస్ 385 లీటర్లు. ఎస్‌యూవీ గ్రౌండ్ క్లియరెన్స్ 188 ఎంఎం. కుషాక్ బేస్ మోడల్ ఫ్రంట్ పవర్ విండోస్, డే-నైట్ ఐఆర్‌వీఎం అడ్జస్టబుల్ ఫ్రంట్ హెడ్‌రెస్ట్, పవర్ స్టీరింగ్, మల్టీ కొలిజన్ బ్రేక్ వంటి ఫీచర్లు ఉన్నాయి. దీని ధర రూ. 11.62 లక్షల నుంచి రూ.19.36 లక్షల వరకు ఉన్నాయి. స్కోడా కుషాక్‌లాగా ఇది కూడా 1.0 లీటర్ టర్బో పెట్రోల్, 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో అదే గేర్ బాక్స్ ఎంపికలతో అందుబాటులో ఉంది. టైగన్, కంఫర్ట్ లైన్, హై లైన్, టాప్ లైన్, టాప్ లైన్ సౌండ్ ఎడిషన్ అనే వేరియంట్లలో అందుబాటులో ఉంది. ఎలక్ట్రికల్‌గా సర్దుబాటు చేయగల ఓఆర్‌వీఎంలు, ఫాలో మీ హెూమ్ లైట్లు, ఐఎస్‌వో ఎఫ్ఐఎక్స్, వెనుక పార్కింగ్ సెన్సార్లు, ఫ్రంట్ సెంటర్ ఆర్మ్‌రెస్ట్/స్టోరేజ్, హాలోజన్‌హెడ్‌ల్యాంప్‌లు, పవర్ స్టీరింగ్, ఫ్రంట్ పవర్ అవుట్‌లెట్ ప్రారంభం వంటి ఫీచర్లు దాని బేస్ మోడల్ నుంచి అందుబాటులో ఉన్నాయి. లీటరుకు 18 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుంది. దీని ధర రూ.10.82 లక్షల నుంచి రూ.18.69 లక్షల వరకు ఉంది. ఈ ఐదు సీట్ల కారు 1.3 లీటర్ టర్బో-పెట్రోల్ ఇంజన్, 1.5 లీటర్ నేచురల్-ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజన్‌లో లభిస్తుంది. ఎంజీ ఆస్టర్ ఫీచర్లలో 10-అంగుళాల టచ్‌స్కీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 6-వే పవర్-అడ్జస్ట్ డ్రైవర్ సీటు, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, క్రూయిజ్ కంట్రోల్, పనోరమిక్ సన్ రూఫ్ ఉన్నాయి. ఈ కారు అడ్వాన్స్‌డ్ డ్రైవ్ అసిస్టెన్స్ సిస్టమ్ ఏడీఏఎస్ ఫీచర్‌తో కూడా వస్తుంది. 5 మంది కూర్చునే సామర్థ్యంతో, ఈ ఎస్‌యూవీ 5 స్టార్ సేఫ్టీ రేటింగ్ కూడా కలిగి ఉంది.

## ఆస్తమాకు ఇలా చేయాలి..

# 4 రోజుల్లోనే దెబ్బకు ఎగిరిపోతుంది..!



మనల్ని వేధించే శ్వాస సంబంధిత సమస్యల్లో ఆస్థమా కూడా ఒకటి. ఈ వ్యాధితో మనలో చాలా మంది బాధపడుతూ ఉంటారు. ఈ సమస్య బారిన పడితే జీవితాంతం బాధపడాల్సింది ఉంటుంది. అలాగే జన్యు పరంగా కూడా ఈ సమస్య వస్తుంది. ఆస్థమా నుండి ఉపశమనాన్ని పొందడానికి మందులను, ఇన్హెలర్ లను వాడుతూ ఉంటారు. ఈసమస్య ఒక్కసారి వస్తే పోదని జీవితాంతం మందులు వాడాల్సిందేనని చాలా మంది చెబుతూ ఉంటారు. అయితే మందులు వాడే అవసరం లేకుండా సహజ పద్ధతుల ద్వారా, జీవన విధానంలో మార్పులు చేసుకోవడం వల్ల ఈ సమస్య నుండి బయటపడవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ పద్ధతులను పాటించడం వల్ల ఎంతో కాలంగా వేధిస్తున్న ఆస్థమా కూడా తగ్గు ముఖం పడుతుందని వారు చెబుతున్నారు. సహజ పద్ధతుల ద్వారా ఆస్థమాను ఎలా తగ్గించుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం. ఆస్థమా వ్యాధితో బాధపడే వారు ఎప్పుడూ కూడా గోరు వెచ్చని నీటిని తాగాలి. అలాగే రోజూ వేడి నీటితో స్నానం చేయాలి. వేడి నీటితో ఆవిరి పట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల కఫం, శ్లేష్మం నుండి ఉపశమనం కలుగుతుంది. అలాగే ఉప్పు లేని ఆహారాన్ని తీసుకోవాలి. ఉప్పును తీసుకోకపోవడం వల్ల ఆస్థమా చాలా వరకు తగ్గుముఖం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఉప్పు లోటు లేకుండా ఉండడానికి కూరలల్లో నిమ్మరసం పిండి తీసుకోవాలి. అలాగే కూరలను వేడి వేడిగా తీసుకోవాలి. దీంతో ఉప్పు లేకుండా కూడా సులభంగా కూరలను తీసుకోవచ్చు. అలాగే ఉడికించిన ఆహారానికి బదులుగా ఉదయం పూట మొలకెత్తిన గింజలను, జామ కాయ వంటి పండ్లను తీసుకోవాలి. ఇలా తీసుకోవడం వల్ల ఉప్పు లేకపోయినా ఆహారాన్ని తీసుకోవచ్చు. అలాగే ఇలా పచ్చి ఆహారాలను తీసుకోవడం వల్ల కఫం ఎక్కువగా తయారవ్వకుండా ఉంటుంది. అదే విధంగా సాయంత్రం పూట ఉడికించిన ఆహారాలకు బదులుగా పండ్లను తీసుకోవాలి. వీటిని కూడా సాయంత్రం ఆరు గంటల లోపు తీసుకోవాలి. ఇలా ఉప్పు లేని ఆహారాలను తీసుకోవడం వల్ల శ్లేష్మం తక్కువగా తయారవుతుంది. శ్లేష్మం తయారవ్వడానికి ముఖ్య కారణం ఉప్పేనని దీనిని తక్కువగా తీసుకోవడం వల్ల వీలైనంత వరకు ఆస్థమా తగ్గుతుందని వారు చెబుతున్నారు. అలాగే ఉప్పును తక్కువగా తీసుకోవడం వల్ల శ్వాస నాళాలు,గాలి గొట్టాలు ఎక్కువగా వ్యాకోచిస్తాయి. దీంతో ఆయాసం తగ్గుతుంది. ఇలా ఆహారాన్ని తీసుకుంటూనే మొదటి 4 రోజులు మందులను వాడాలి. క్రమంగా మందుల వాడకాన్ని, ఇన్హెలర్ వాడకాన్ని తగ్గిస్తూ ఉండాలి. ఈ విధంగా ఆహారాన్ని తీసుకోవడం వల్ల 20 నుండి 30 రోజుల్లోనే ఆస్థమా నుండి చక్కటి ఉపవమనం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ విధంగా ఉప్పు లేకుండా ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఆస్థమా తగ్గుతుందని చలికాలంలో, వర్షాకాలంలో కూడా ఎటువంటి సమస్య లేకుండా ఉంటుందని, తలస్నానం చేసిన, పుల్లటి పండ్లను తిన్నప్పటికి కూడా ఏం కాదని వారు చెబుతున్నారు.

## రిలయన్స్ ఎప్పటికీ సంతృప్తి చెందదు..ఉద్యోగులకు

# ముఖేష్ అంబానీ కీలక సూచనలు



గత కొన్ని సంవత్సరాలలో ప్రపంచంలోనే అతిపెద్ద సింగిల్ లొకేషన్ ఆయిల్ రిఫైనింగ్ కాంప్లెక్స్ నుండి దేశంలోని అతిపెద్ద మొబైల్ నెట్‌వర్క్ ఆపరేటర్ వరకు కొన్ని సంవత్సరాలలో వ్యాపారాలను సృష్టించిన బిలియనీర్ ముఖేష్ అంబానీ తన గ్రూప్ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ఎప్పటికీ సంతృప్తి చెందదని,ప్రపంచంలో టాప్ 10 వ్యాపార సమ్మేళనాలలో ఒకటిగా ఎదుగుతుందని చెప్పారు.రిలయన్స్ గ్రూప్ వ్యవస్థాపకుడు ధీరూభాయ్ అంబానీ జన్మదినమైన రిలయన్స్ ఫ్యామిలీ డేసందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ముఖేష్ అంబానీ మాట్లాడుతూ.. డిజిటల్ డేటా ప్లాట్‌ఫామ్‌లు, అడాప్షన్‌లో గ్లోబల్ లీడర్స్ లో స్థానాన్ని సుస్థిరం చేయడమే రిలయన్స్ ఇప్పుడు లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. " ప్రస్తుత వ్యాపార ధోరణులు దేశ విదేశాల్లో చాలా వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆత్మసంతృప్తికి ఆస్కారం లేదు. గతంలో రిలయన్స్ ఎప్పుడూ ఆత్మసంతృప్తి చెందలేదు. భవిష్యత్తులో రిలయన్స్ ఎన్నటికీ సంతృప్తి చెందదు. నిరంతర ఆవిష్కరణలు, పునరుద్ధరణల ద్వారా మార్కెట్ లో దూసుకెళ్తాం. అత్యున్నత స్థాయిని సెట్ చేయడానికి మేము ధైర్యాన్ని ప్రదర్శించాము మరియు కొత్త రికార్డులను సృష్టించడానికి మరింత ఎత్తుకు ఎగరగల సామర్థ్యాన్ని ప్రదర్శించాము. ఈ విధంగా రిలయన్స్ శాశ్వత వృద్ధిని సాధించింది" అని ముఖేష్ అంబానీ ఆయన అన్నారు. భారతదేశం.. ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి ముందుకు సాగుతున్నందున, రిలయన్స్‌కు అపూర్వమైన అవకాశం ఎదురుచూస్తున్నట్లు ఆయన అన్నారు. ఆదాయాలు, లాభాలు, మార్కెట్ విలువ ప్రకారం రిలయన్స్ భారతదేశపు అతిపెద్ద సంస్థ. రాబోయే సంవత్సరాల్లో, మునుపెన్నడూ ఎవరూ సృష్టించని ఉత్పత్తులు, సర్వీసులను అభివృద్ధి చేయడానికి మరింత కష్టపడటం కొనసాగించాలని ఆయన ఉద్యోగులను కోరారు. కంపెనీ చర్యలు ఎల్లప్పుడూ సమాజ విశ్వాసాన్ని గెలవాలన్నారు. "తమ వ్యాపారాలన్నీ విపరీతంగా వృద్ధి చెందినప్పుడు, భారతదేశం యొక్క సమ్మిళిత శ్రేయస్సుకు మనం మరింత దోహదపడగలము, ప్రపంచాన్ని మెరుగైన ప్రదేశంగా మార్చగలము" అని ఆయన అన్నారు.

"రిలయన్స్ ఒక ప్రత్యేకమైన కొత్త తరం టెక్నాలజీ సంస్థగా అవతరించినందున, నిర్ణయం తీసుకోవడం,వనరుల వినియోగంలో మెరుగ్గా మారడానికి ధైర్యంగా డేటా, %ూ×%ని స్వీకరించాలన్నారు. డిజిటల్ యుగంలో ఏఐ టెక్నాలజీకి ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

దీనిలో భాగంగా.. ఉత్పాదకత, సామర్థ్యంను సాధించడానికి ఏఐను ఉపయోగించుకుంటూ ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ డిజిటల్ యుగంలో డబ్బు, ప్రతిభతో పాటు సాంకేతికత కూడా ముఖ్య అంశంగా మారిందన్నారు. %ూ×% యొక్క అవకాశాలను తయారీ రంగంలో కూడా ఉపయోగించుకోవాలని ముకేశ్ అంబానీ అన్నారు.

## రైల్వే ట్రాక్‌పై కంచె నిర్మాణం?

# వందేభారత్ రైలు కోసమే ప్రత్యేకం..



సమయాన్ని ఆదా చేసేందుకు, రైల్వే ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలను కల్పించే ప్రయత్నంలో భారతీయ రైల్వే అత్యంత వేగవంతమైన రైలును పరిచయం చేయడానికి, స్టేషన్లలో సౌకర్యాలను మెరుగుపరచడానికి ప్రయాణాన్ని ప్రారంభించింది. నిబద్ధతకు అనుగుణంగా దేశవ్యాప్తంగా ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తూ 75 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టాలని రైల్వే శాఖ యోచిస్తోంది. కొన్ని వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఇప్పటికే అందు బాటులో ఉన్నాయి. ప్రయాణికులను తక్కువ సమయంలో వారి గమ్యస్థానాలకు చేరవేస్తుంది. ముఖ్యంగా వందే భారత్ రైళ్లు నీలం, తెలుపు రంగు రైళ్లను ప్రారంభించడంతో పాటు రైల్వేలు ట్రాక్‌ల భద్రతపై కూడా దృష్టి సారిస్తున్నాయి. రైళ్లు గరిష్ట వేగంతో నడపడానికి వీలు కల్పిస్తుంది. అయితే కొన్ని ప్రాంతాల్లో ట్రాక్‌ల భద్రత జాతీయ రవాణాదారుని దృష్టిని ఆకర్షించింది. ఇది ఇప్పుడు ట్రాక్‌లను రక్షించడానికి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ట్రాక్ వెంట ఫెన్సింగ్ వేసే అవకాశం ఉందని కొన్ని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా హాని కలిగించే ప్రాంతాల్లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ట్రాక్‌ల భద్రతపై దృష్టి సారించిన భారతీయ రైల్వే, హాని కలిగించే ప్రాంతాల్లో ట్రాక్‌ల వెంట ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. లోక్‌సభలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వందేభారత్ రైళ్లకు హాని కలిగించే ప్రదేశాలలో భద్రతా కంచెలను ప్రవేశపెట్టడానికి రైల్వే చర్యలు చేపట్టిందని, ఈ రైళ్లు గంటకు 110 నుండి 130 కిలోమీటర్ల వేగంతో నడపడానికి వీలు కల్పిస్తున్నాయని తెలియజేశారు. వందేభారత్ రైళ్ల వేగాన్ని దృష్టిలో ఉంచుకుని రైల్వే ట్రాక్‌ల భద్రతను నిర్ధారించడానికి రైల్వేల తరలింపు గురించి సమాచారం కోరుతూ అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి ఈ మేరకు ప్రకటించారు. రైల్వే ట్రాక్‌లు, ప్రయాణీకుల భద్రత భారతీయ రైల్వే ప్రధాన ఆందోళన అని కేంద్ర మంత్రి రాతపూర్వక ప్రతిస్పందనలో పేర్కొన్నారు. ట్రాక్‌ల వెంబడి కంచెలను ఏర్పాటు చేయడంతో పాటు, ట్రాక్‌ల తనిఖీ, నిర్వహణ, మరమ్మతుల కోసం రైల్వే వ్యవస్థను కూడా ఏర్పాటు చేసింది. అంతేకాకుండా రైల్వే ట్రాక్‌ల పెట్రోలింగ్, ఆధునిక ట్రాక్ నిర్మాణం, ట్రాక్ నిర్వహణకు సంబంధించిన యాంత్రీకరణ, లోపాలను గుర్తించడానికి పట్టాల అల్ట్రాసోనిక్ లోపాలను గుర్తించే పరీక్ష వంటి ట్రాక్‌ల భద్రతను నిర్ధారించడానికి రైల్వే అనేక ఇతర చర్యలను కూడా తీసుకుంటుంది.

## చలి కాలంలో మార్నింగ్

# వాకింగ్ చేయడం మంచిదేనా..?



ఉదయాన్నే లేచి వాకింగ్ చేయడం అనేది చాలా మంచి అలవాటు. ఉదయం కుదరని వారు సాయంత్రం అయినా నడవడం మంచిది. వాకింగ్ చేయడం వల్ల ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్న సంగతి తెలిసిందే. అయితే చలి కాలంలో ఉదయం వాకింగ్ చేయడం మంచిదేనా? అని చాలా మందిలో ప్రశ్నలు తలెత్తుతాయి. ఒకవేళ మంచిదే అయితే ఎంత సేపు నడవాలి? అని అనుకుంటూ ఉంటారు. నిపుణులు ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. కాలం ఏదైనా సరే ఉదయం పూట వాకింగ్ చేయడం వల్ల చాలా మంచి బెనిఫిట్స్ ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కానీ మరీ విపరీతమైన చలిలో వాకింగ్ చేయడం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు. చలి కాలంలో ఉదయం పూట నడవడం వల్ల ఆరోగ్యానికి హానికరం అని చెబుతున్నారు. ఒక వేళ చేయాలి అనుకునే వారు కొన్ని రకాల జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. చలి కాలంలో వాకింగ్ కి వెళ్లే ముందు సరిగ్గా డ్రెస్ వేసుకోవాలి. మరీ టైట్ వి కాకుండా.. కాస్త వదులుగా ఉండే వాటిని ధరించడం మేలు. ఎక్కువగా బరువు ఉండే దుస్తులు ధరించకూడదు. అదే విధంగా వెచ్చగా ఉండేలా చూసుకోవాలి. తలకు, చెవుల్లో గాలి చేరకుండా, కాళ్లు, చేతులను కూడా కప్పుకోవాలి. చలిలో నడిచేటప్పుడు మొదట వేగంగా నడవాలి. దీంతో బాడీలో హీట్ ప్రొడ్యూస్ అవుతుంది. ఆ తర్వాత మెల్లగా నడిస్తే.. ఆ హీట్ సరిపోతుంది. గుండె సమస్యలు, ఆస్తమా, న్యుమోనియా వంటి సమస్యలు ఉంటే ఉదయం వాకింగ్ చేయకపోవడమే బెటర్. సాయంత్రం సమయం అది కూడా 6 గంటలలోపే చేయాలి. ఉదయం సూర్య రశ్మి భూమికి తాకేటప్పుడు నడిస్తే చాలా మంచిది. ఈ సీజన్ లో కాస్త తక్కువగా నడిచినా ఎలాంటి హాని ఉండదు. ఇంట్లోనే పలు రకాల వ్యాయామాలు చేసుకుంటే సరిపోతుంది. శీతా కాలంలో నడవడం వల్ల శరీరంలో ఇమ్యూనిటీ అనేది పెరుగుతుంది. బద్ధకం వదిలి.. యాక్టీవ్ గా ఉంటారు. దీంతో వ్యాధులు వచ్చే అవకాశం కూడా తగ్గుతుంది. ఇన్ఫెక్షన్లు కూడా దరి చేరకుండా ఉంటాయి.

## ముంచుకొస్తున్న మాంద్యం..

# ఆర్థిక శాఖ వార్నింగ్.. జాబ్స్, ఇన్వెస్ట్‌మెంట్స్ పరిస్థితి..



ముగింపు దశకు వచ్చిన 2023లో దేశ ఆర్థిక వ్యవస్థ వండర్స్ సృష్టించింది. వివిధ అంతర్జాతీయ సంస్థలు సైతం భారత వృద్ధిని ప్రశంసించాయి. దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ సత్ఫలితాలను ఇచ్చింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మాత్రం ఈ విషయంలో బ్యాడ్ న్యూస్ చెప్పింది. మాంద్యం భయాలు 2024లో కనిపించవచ్చని పేర్కొంది. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల మధ్య ఆహారం మరియు ఇంధన ధరలు పెరుగుతున్నట్లు గుర్తుచేసింది. ప్రస్తుత అనిశ్చితి నేపథ్యంలో మాంద్యం హెచ్చరికలు జారీ చేసింది. ద్రవ్యోల్బణం పట్ల ప్రభుత్వం సహా హై అలర్ట్‌లో ఉన్నట్లు స్పష్టం చేసింది. అక్టోబర్ 2023 గ్లోబ్ ట్రేడ్ ఔట్ లుక్ మరియు గణాంకాల ప్రకారం ప్రపంచ వాణిజ్య పరిమాణం క్షీణించే అవకాశం ఉంది.

ఇందుకు అనుగుణంగా దేశీయంగానూ దిగుమతుల్లో పెరుగుదల, ఎగుమతుల్లో తగ్గుదల నమోదవుతున్నట్లు కేంద్రం తెలిపింది. తద్వారా రికార్డు స్థాయిలో వాణిజ్య లోటు నెలకొన్నట్లు స్పష్టం చేసింది. విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్స్ లో సానుకూల ఇన్‌ఫ్లోలు రూపాయి అస్థిరత నియంత్రణకు ఎంతగానో ఉపకరించినట్లు వెల్లడించింది.

# నచ్చింది ఎంచుకునే స్వేఛ్ఛ ఉంది



'డంకీ' సక్సెస్‌ను ఆస్వాదిస్తున్న తాప్సీ తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'యానిమల్' చిత్రంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు."ఇండస్ట్రీ ఏదైనా నటీనటులకు ఒక పవర్ ఉంటుంది. దాంతోపాటే కొన్ని బాధ్యతలు కూడా ఉంటాయి.ఇతర నటీనటులను వేలెత్తి చూపించి.. వాళ్లు ఇలాంటివి చేయకుండా ఉండాల్సిందని చెప్పే మనస్తత్వం నాకు లేదు. ఎందుకంటే, అది వాళ్ల వ్యక్తిగత అభిప్రాయం. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం. నచ్చింది ఎంచుకునే స్వేచ్ఛ సమాజం మనకు ఇచ్చింది. నేను అయితే అలాంటి కథలకు ఓకే చెప్పను" అని తాప్సీ అన్నారు.దేశ సరిహద్దుల ద్వారా అక్రమంగా ప్రయాణించడాన్ని డాంకీ ట్రావెల్ అంటారు. పంజాబీ వాళ్లు దానిని 'డంకీ' అని పిలుస్తుంటారు, అలా.. భారత్ నుంచి ఎన్నో దేశాలు దాటి యూకేలోకి అక్రమంగా ప్రవేశించే స్నేహితుల చుట్టూ తిరిగే కథతో రూపొందిన చిత్రమిది. రాజ్‌కుమార్ హిరాణీ దర్శకత్వం వహించారు. షారుక్ ఖాన్, విక్కీ కౌశల్, తాప్సీ కీలక పాత్రలు పోషించారు. కామెడీ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రం డిసెంబర్ 21న విడుదలై విజయం సాధించింది.

# గేమ్ ప్లాన్ మారుస్తున్న శంకర్



ఒకేసారి రెండు ప్యాన్ ఇండియా సినిమాలు తీస్తున్న దర్శకుడు శంకర్ దేవర గురించి వస్తున్న వార్తలు చూసి గేమ్ ప్లాన్ మారుస్తున్నారని ఇన్ సైడ్ టాక్. ఏప్రిల్ 5 విడుదల కావాల్సిన జూనియర్ ఎన్టీఆర్ మూవీకి సమయం సరిపోదనే ఉద్దేశంతో వాయిదా తప్పదనే దిశగా ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది.దానికి తోడు సైఫ్ అలీఖాన్ ఆసుపత్రి పాలై చిన్న సర్జరీతో ఇంటికొచ్చి విశ్రాంతి తీసుకోవడం సమస్యని మరింత జటిలం చేసింది. ఎప్పటి నుంచి జాయిన్ అవుతాడనే దాని గురించి ఎలాంటి స్పష్టత లేదు. సైఫ్ స్వయంగా చెబితే తప్ప దేవర టీమ్ సైతం ఏం చేయలేని పరిస్థితి నెలకొంది. దీన్ని శంకర్ తనకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నారట. ఒకవేళ దేవర కనక నిజంగా తప్పుకునే పనైతే భారతీయుడు 2ని అదే డేట్ కి తీసుకొస్తే ఎలా ఉంటుందనే దిశగా చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ముందు అనుకున్న డేట్ అయితే ఏప్రిల్ 12. కానీ ఇప్పుడు పెద్ద వీకెండ్ ఖాళీ అవుతోంది కాబట్టి ఆ స్థానాన్ని తాము తీసుకుంటే ఎలా ఉంటుందనే కోణంలో లైకా సంస్థ ప్రతినిధులతో సాధ్యాసాధ్యాలను విశ్లేషిస్తున్నారు. ఇది తేలాలంటే ముందు దేవర అనౌన్స్ మెంట్ రావాలి. కానీ ఇప్పటికిప్పుడు ఎలాంటి పుకార్లు వచ్చినా స్పందించే ఉద్దేశం కొరటాల బృందంలో లేదు. ఎందుకైనా మంచిదని భారతీయుడు 2 పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేశారు. రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ ని సెప్టెంబర్ లేదా అక్టోబర్ లో ఎట్టి పరిస్థితుల్లో రిలీజ్ చేయాలని చూస్తున్న నిర్మాత దిల్ రాజుకి సహకరించాలంటే ముందు కమల్ హాసన్ సినిమాకు మోక్షం కలిగించాలి. పైగా శంకర్ చేతిలో ఇండియన్ 3 ఉంది. అది కూడా ఈ సంవత్సరమే షూటింగ్ పూర్తి చేసే సంకల్పంతో ఉన్నారు శంకర్. నిజంగా దేవర డ్రాప్ అయినా దాని మీద ఫ్యామిలీ స్టార్, టిల్లు స్క్వేర్ ఇప్పటికే కన్నేశాయి. చూస్తుంటే పరిణామాలు రాబోయే రోజుల్లో చాలా ఆసక్తికరంగా మారబోతున్నట్టు కనిపిస్తోంది.



# హనుమంతుడిగా రానా దగ్గుబాటి.?



టాలీవుడ్ లేటెస్ట్ సెన్సేషన్ ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం 'హనుమాన్'. తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ దగ్గర సంచలనాలు సృష్టిస్తుంది. ఇప్పటివరకు ఈ చిత్రం వరల్డ్‌వైడ్‌గా రూ.200 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఇదిలావుంటే ఈ సినిమా ముగింపులో సీక్వెల్ ఉంటుందని ప్రశాంత్ వర్మ ప్రకటించిన విషయం తెలిసిందే. 'హనుమాన్'కు సీక్వెల్‌గా రానున్న 'జై హనుమాన్ కు సంబంధించి ఇప్పటికే స్క్రిప్ట్ కూడా సిద్ధమయిపోయిందని ప్రశాంత్ వర్మ వెల్లడించాడు. దీంతో ప్రేక్షకులంతా సెకండ్ పార్ట్ 'జై హనుమాన్' కోసం ఎంతో క్యూరియాసిటీతో ఎదురు చూస్తున్నారు. కాగా ఈ సినిమాలో హనుమంతుడిగా ఎవరు కనిపించబోతున్నారు అనేది అందరిలో ఆసక్తి నెలకొంది. అయితే ఈ సినిమాలో హనుమంతుడిగా కనిపించబోయేది ఇతడే అంటూ టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి గురించి సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. రానా కూడా హనుమంతుడి రోల్‌లో బాగా సెట్ అవుతాడని సోషల్ మీడియాలో నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక దీనిపై అధికారిక ప్రకటన రాకపోగా.. దర్శకుడు ప్రశాంత్ వర్మ క్లారిటీ ఇవ్వవలసి ఉంది. ఇక ఈ సినిమా 2025లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# అతడి ఓపిక.. అద్భుతం

'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2', 'లైగర్', 'డ్రీమ్‌గర్ల్ 2'లాంటి చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరైన యువ నాయిక అనన్య పాండే.కొన్నాళ్లుగా ఆదిత్యరాయ్ కపూర్‌తో ప్రేమలో ఉంది. ఈ విషయాన్ని తను ఏనాడూ దాచుకోవడానికి ప్రయత్నించలేదు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అతడిలో నచ్చే గుణాలను ఏకరువు పెట్టింది. 'ఆదిత్య చాలా ఓపికగా ఉంటాడు. 'ఆషికీ 2' తర్వాత తనకి చాలా అవకాశాలొచ్చాయి. కానీ వేటినీ తొందరపడి ఒప్పుకోలేదు. అతడికి నచ్చే ప్రాజెక్టు వచ్చే దాకా ఎదురు చూశాడు. ఒక్కసారి ఒప్పుకున్నాక ఆ పాత్రతో ప్రేమలో పడిపోతాడు. వందశాతం మనసు పెట్టి పని చేస్తాడు. ఎంత ఆలస్యమైనా సరే.. పరిశ్రమ నుంచి వచ్చే ఒత్తిళ్లకు ఏమాత్రం లొంగడు' అంటూ ప్రియుడిని తెగ మెచ్చుకుంది. 'ఆదరాబాదరాగా ఒప్పుకొని, ఒకేసారి నాలుగైదు సినిమాల్లో కనపడాలనే ఆతృత అతడికేమాత్రం ఉండదు. తనపై తాను నమ్మకం ఉంచుకొని నచ్చే కథ దొరికేవరకు ఎంతో ఓపిగ్గా ఉంటాడు' అంటూ మరిన్ని వివరాలు వెల్లడించింది. మరోవైపు అనన్య చివరిసారిగా సిద్ధాంత్ చతుర్వేది తెరకెక్కించిన 'ఖోగయే హమ్ కహా'లో కనిపించింది. తాజాగా పారిస్ ఫ్యాషన్ వీక్‌లో రెడ్ కార్పెట్‌పై ఆకట్టుకునే ఆహార్యంతో అలరించింది అనన్య.

PUBLISHER, PRINTER &OWNED BY M PUSHPAVATHI H. NO:10-80/4,VIGNESHWARA COLONY, MARLU, MAHABUB NAGAR, TELANGANA -509001. PRINTED BY MYTHRI ART PRINTERS 10 DCC COMPLEX, MAHABUB NAGAR, TELANGANA. EDITER : SRINIVAS PARREPATI H NO:6-1262,ROAD -20, PARVATHAPUR, MEDIPALLY, MEDCHAL -MALKAJGIRI, TELANGANA -500098, TELTEL/2016/69844, PH: 9010899869, GMAIL : telanganachethanam@gmail.coms